ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 27 సంచిక : 12 ఆగష్టు 2022

## ఈ సంచికలో. . . .

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 2


శ్రీమద్భగవద్గీత ........................................................ 24

అక్షరమణమాల ........................................................ 27

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



"కొండమీద ఉన్న దీపాన్ని ఎవరికీ కనపడకుండా నువ్వు చెయ్యగలవా" అన్నాడు ఏసు. ఆత్మానుభవం ఉన్న వాడిని, బ్రహ్మానుభవం పొందిన వాడిని ఒకవేళ నీ ఇంటిలో బంధించి ఉంచాలన్నా నీకు సాధ్యమౌతుందా? వాడు యూనివర్సల్ అయ్యాక, ఇండివిడ్యుయల్ జీవితం లాగా వాడి జీవితం ఉండటానికి అవకాశం లేదు.

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 13 అక్టోబర్ 1991, ఆలమూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

అధ్యయనం అంటే వేదాంత గ్రంథాలు చదవటం వల్ల, అంటే భగవద్గీత కాని, ఉపనిషత్తులు కాని, బ్రహ్మ సూత్రాలు కాని, బాగా అధ్యయనం చేయటం వల్ల, ముక్తిని కాని, సత్యం ఒక్కటే అని గ్రహించే ప్రజ్ఞ కాని సమకూర్చగలవా అని ఒక భక్తుడు భగవాన్‌ని అడుగుతున్నాడు. దానికి భగవాన్ చెప్పిన సమాధానం ఏమిటంటే అల్పాల్పం, అంటే కొంచెం గ్రహించే శక్తి కలుగుతుంది. అంటే చదువు వల్ల మీకు వచ్చేయదు. మీరు భగవద్గీత చదువుకోవచ్చు, ఉపనిషత్తులు చదువుకోవచ్చు, అంత మాత్రం చేత మీకు ఇక్కడ బ్రహ్మానుభవం కాదు. అయితే పుస్తకాలు చదవడం వల్ల ప్రయోజనం ఏమిటంటే, అసలు మనం ఎలా జీవించాలి, ఎలా సేవించాలి, ఎలా ప్రేమించాలి, ఎలా ఈ శరీరాన్ని విడిచి పెట్టాలి ఇటువంటి కొన్ని విషయాలు నేర్పుతాయి. జీవించినంత కాలం ఎలా జీవించాలి? తోటి మనుషులని ఎలా ప్రేమించాలి అనేవి తెలుస్తాయి. మన హృదయంలో అహంభావం లేకుండా, ద్వేషం లేకుండా, అసూయ లేకుండా ఉంటే ఇతర మనుషులుని ప్రేమించగలం. మన హృదయంలో అహంభావం లేదు అనుకోండి, మన హృదయంలో ద్వేషం లేదు అనుకోండి, మనలని మనం ఎలా ప్రేమించుకుంటున్నామో, ఇతరులను కూడా అలా ప్రేమించగలం. అలా ప్రేమించడం కనుక నేర్చుకుంటే, మనం చేసే ప్రతి పని కూడా యోగంగా మారుతుంది. మనం చేస్తున్న పని యోగంగా మారితే, మనలో లోపాలు ఏమైనా ఉంటే ఆ లోపాలు అన్నీ పోతాయి, తాపాలు ఉంటే పోతాయి. బలహీనతలు ఉంటే పోతాయి. కేవలం పుస్తకాలు చదవటం వల్లే మనకు బ్రహ్మం తెలియదు. బ్రహ్మం మనం తెలుసుకోవాలంటే, ఇంద్రియాలకి శాంతి ఉండాలి, మనస్సుకి శాంతి ఉండాలి. మీరు ఏ మతస్తులు అయినా, ఏ కులస్తులు అయినా, ఏ ప్రాంతం వారు అయినా, ఏముండాలి? ఇంద్రియాలకి శాంతి ఉండాలి. మనస్సుకి శాంతి ఉండాలి. ఎవరైతే మన ఇంద్రియాలకి, మన మనస్సుకి అశాంతిని తీసుకు వస్తున్నారో, వాళ్లకి ఒక నమస్కారం పెట్టి దూరంగా తప్పుకోవడం మంచిది. ఎందుచేత అంటే ఇటువంటి వారితో స్నేహం వల్ల, మన సాధన అంతా కూడా నిష్ప్రయోజనం అయిపోతుంది. మనం చేస్తున్న సాధన నిజమైన సాధన అయితే, అది సరళమైన సాధన అయితే మన ఇంద్రియాలకి శాంతి కలగాలి, మన మనస్సుకి శాంతి కలగాలి. ఎవరైతే

మన ఇంద్రియాలకి, మన మనస్సుకి అశాంతి తీసుకు వస్తున్నారో, ఎవరైతే మనకు ప్రకోపం తీసుకు వస్తున్నారో, ఎవరైతే మనలని క్షోభ పెడుతున్నారో, ఆ మనిషికి నువ్వు సాధ్యమైనంత వరకూ దూరంగా ఉండాలి.

ఆచార్యుల స్వామి వారు అన్నారు ఒకటి సద్గురువు, రెండు సత్సాంగత్యం, ఇవి రెండూ దొరకటం ఈ ప్రపంచంలో చాలా కష్టం అని చెప్పారు. డబ్బు సంపాదించడం కంటే, చదువు సంపాదించటం కంటే సత్సాంగత్యం, సద్గురువు దొరకటం చాలా కష్టం. ఈ శరీరం ఎలా నడుస్తుంది అంటే ఇంద్రియాలు చెప్పినట్టు ఈ శరీరం నడుస్తుంది. కళ్ళకి సినిమా చూడాలని ఉంటే ఈ శరీరాన్ని తీసుకెళ్ళి అక్కడ పడేస్తాయి కళ్ళు. ఏదోకటి తినాలి అని ఉంది అనుకోండి కాఫీ హొటల్ కి తీసుకు పోతుంది నాలుక. అందుచేత ఇంద్రియాలు ఎలా చెబితే అలా శరీరం వింటుంది. మీ ఇంద్రియాలు చెప్పినట్టు మీ శరీరం వింటుంది. నా ఇంద్రియాలు చెప్పినట్టు నా శరీరం వింటుంది. మరి ఇంద్రియాలు ఎవరు చెప్పినట్లు వింటాయి? మనస్సు చెప్పినట్టు ఇంద్రియాలు వింటాయి. మనస్సు ఎవరు చెప్పినట్టు వింటుంది? బుద్ధి చెప్పినట్టు మనస్సు వింటుంది. బుద్ధి ఎవరు చెప్పినట్టు వింటుంది? ఆత్మ చేతిలో బుద్ధి ఉంది. ఇంద్రియాలు చేతిలో శరీరం ఉంది, మనస్సు చేతిలో ఇంద్రియాలు ఉన్నాయి. మరి బుద్ధి చేతిలో మనస్సు ఉంది, ఆత్మ చేతిలో బుద్ధి ఉంది. అందుచేత మీకు ఆత్మానుభవం కనుక వస్తే, బ్రహ్మానుభవం కనుక మీకు వస్తే, ఇవన్నీ మీకు స్వాధీనం అయిపోతాయి. శరీరం స్వాధీనం అయిపోతుంది. ఇంద్రియాలు స్వాధీనం అయిపోతాయి. మనస్సు స్వాధీనం అయిపోతుంది. బుద్ధి స్వాధీనం అయిపోతుంది. ఆత్మ ఎక్కడ ఉంది? మన హృదయంలోనే ఉంది. అదే ఇది, ఇదే అది అన్నారు వేదంలో. అంటే సర్వత్రా వ్యాపించినటువంటి భగవంతుడు మన హృదయంలో ఆత్మగా ఉన్నాడు. అదే ఇది, ఇదే అది. అంటే ఈ ఆత్మే భగవంతుడిగా ఉన్నాడు. ఇక్కడ నిజమైనటువంటి ఆత్మకి, భగవంతుడికి బేధం లేదు. బేధం ఎవరైతే చూస్తారో వాళ్ళ నోట్లో దుమ్ము పడుతుంది. బేధం కల్పితం, ద్వైతం కల్పితం, ఎక్కడైతే బేధం ఉందో అక్కడ భయం కూడా కలుగుతుంది. అంతటా వ్యాపించిన వస్తువు నీ హృదయంలో ఉంది. నీ హృదయంలో ఉన్న వస్తువు అంతటా వ్యాపించి ఉంది. అదే ఇది, ఇదే అది. దానికి దీనికి బేధం లేదు. ఉన్నది ఒక్కటే వస్తువు. అది మన హృదయంలో సజీవంగా ఉంది. నువ్వు ఆత్మని ఎలా దర్శించాలి? ఆత్మానుభవం ఎలా పొందాలి? నీవు వేదాలు, ఉపనిషత్తులు ఎన్ని చదువుకున్నా, బైబిలు చదువుకున్నా, ఖురాను చదువుకున్నా, ఎన్ని పుస్తకాలు చదువుకున్నా సరే ఆత్మ ఒకటి ఉంది, బ్రహ్మము ఒకటి ఉంది

అనే సజీవమైన విశ్వాసం మీకు కలగదు. ఆత్మానుభవం ఎవరికి అయితే ఉందో, బ్రహ్మానుభవం ఎవరికి అయితే ఉందో, ఆ బ్రహ్మానుభవం ఉన్నవాడు బ్రహ్మం గురించి చెబుతుంటే మీకు విశ్వాసం కలుగుతుంది కాని, కేవలం పుస్తకాలలో మీరు చదివితే అది కలుగదు.

పంచదార చేదుగా ఉంటుంది అని నేను చెబుతాను అనుకోండి, మీరు ఎవరైనా నమ్ముతారా? మీరు ఎవ్వరు నమ్మరు. ఎందుచేత? పంచదార తియ్యగా ఉంటుంది అని మీ ఇంద్రియ అనుభవం. ఏవండీ, ఆముదం తియ్యగా ఉంటుంది అని నేను చెబుతాను అనుకోండి మీరు ఎవరైనా నమ్ముతారా? నమ్మరు. ఎందుచేత? దాని గురించి మీ అనుభవం మీకు ఉంది. సామాన్య మానవుడికి ఇంద్రియాలకు సంబంధించినటువంటి అనుభవం ఎలా ఉంటుందో, బ్రహ్మ వ్యక్తికి బ్రహ్మానుభవం అలా ఉంటుంది. గ్రంధాలలో చదువుకున్న విషయాన్ని మీరు ఆచరించడానికి ప్రయత్నం చేస్తుంటే, ఆరోజుకారోజు, ఆజన్మకాజన్మ, మీకు అనుభవానికి చిక్కుతుంది. అంటే ఏదైతే మీరు నేర్చుకుంటున్నారో, ఏదైతే మీరు శ్రవణం చేస్తున్నారో, ఏదైతే మీరు మననం చేస్తున్నారో, దానిని చేతనైనంత వరకు ఆచరించాలి అనే బుద్ధి మీకు కలగాలి. ఎప్పుడు మీకు ఆ బుద్ధి కలుగుతుంది? సత్సాంగత్యం వల్ల కలుగుతుంది. విన్న విషయాన్నీ మీరు ఎంతవరకు ఆచరించగలిగితే, అంతవరకు ఆచరించడానికి ప్రయత్నం చెయ్యాలి. ఆచరిస్తేనే అది మీకు అనుభవానికి చిక్కుతుంది. అందరూ ఏదొక రోజున మరణిస్తారు. కానీ మరణం లేని వస్తువు ఇక్కడ మన హృదయంలో ఉంది. ఆ వస్తువును మనం తెలుసుకునే వరకు మనకు మరణం తప్పదు, జననం తప్పదు. సేవించటంతో పాటు, ప్రేమించటంతో పాటు, జీవించటంతో పాటు, ఈ దేహాన్ని ఎలా విడిచి పెట్టాలో మనం నేర్చుకోవాలి. జన్మ మారటం అంటే ఏమీ లేదు పాత చొక్కా తీసి కొత్త చొక్కా వేసుకోవడం లాంటిది. పాత చొక్కా తీసేసి కొత్త చొక్కాను

**మంచిగా జీవించటం కంటే మించిన తపస్సు లేదు. జీవితం పొడుగునా మంచిగా జీవించేవానికి మనస్సు యొక్క పొరలలో దాగి ఉన్న దోషాలు రాలిపోయి, జ్ఞానం వైపుకు దారి కనిపిస్తుంది.**



ఎంత తేలిగ్గా వేసుకుంటామో, అంత తేలికగా ఈ శరీరాన్ని విడిచి పెట్టడం కూడా నేర్చుకోవాలి అని భగవంతుడు చెబుతున్నాడు. అంత తేలిగ్గా మనం నేర్చుకోగలుగుతున్నామా? మనకు ఉన్న గురువు ద్వారా, పరమేశ్వరుడు ద్వారా, ఉపనిషత్తులు ద్వారా, మనం నేర్చుకున్నటువంటి విషయాలను నెమ్మదిగా ఆచరించటం ద్వారా, మనకు అది అనుభవంలో చిక్కుతుంది. కేవలం పుస్తకాల వల్ల ఇది వచ్చేయదు. పుస్తకాలలో ఉన్న విషయం మన మనస్సుకి పట్టించుకోవాలి. లోకంలో ఎన్నో ఆకర్షణలు ఉన్నాయి. ఈ ఆకర్షణల నుండి బయటకి రావటానికి వీరుడు, ధీరుడే బయటకి రాగలడు కాని, ధీరుడు కాని వాడు, వీరుడు కాని వాడు, శూరుడు కాని వాడు ఆకర్షణ అనే ప్రవాహంలో కొట్టుకు పోతాడు. ఏదైతే భగవంతుడు చెయ్యమని చెప్పాడో అది చెయ్యండి, అది కర్మ. ఏ పని నిషేధించాడో అది వికర్మ. అందుచేత భగవంతుడు చెయ్యమన్న పని మనం చేస్తూ, వద్దన్న పని మనం మానేస్తూ, ఆ రకంగా కనుక మనం జీవితాన్ని గడుపుతుంటే, మన మనస్సుకి ఆరోజుకారోజు, అంతర్ముఖం అయ్యే స్థితి కలుగుతుంది. అంటే లోపలికి వెళ్ళే స్థితి కలుగుతుంది. కొంతమంది ఇంద్రియాలను కదపరు, ఆ ఇంద్రియానికి సంబంధించిన విషయాన్ని ఇంటిదగ్గర కూర్చొని ఆలోచిస్తూ ఉంటారు, వాళ్ళని మిధ్యాచార్యులు అని చెప్పాడు భగవంతుడు. నువ్వు అలా ఉండొద్దు. నీకు ఆత్మానుభవంలోకి రావాలంటే, నువ్వు మంచిని విడిచి పెట్టకు. ఏదైతే భగవంతుడు చెయ్యమని చెప్పాడో అది చెయ్యి, ఏదైతే భగవంతుడు వద్దని చెప్పాడో అది మానెయ్యి. ఆ రకంగా కనుక మనం జీవితాన్ని గడుపుతుంటే, మన మనస్సుకి ఆరోజుకారోజు అంతర్ముఖం అయ్యే స్థితి కలుగుతుంది. పుస్తకాల ద్వారా నేర్చుకునే విషయాలు చాలా స్వల్పం. అంత మాత్రం చేతే మీకు ఆత్మానుభవం కాదు. ఎవరైతే బ్రహ్మమును తెలుసుకున్నారో వాడితోటి స్నేహం చెయ్యి. వాడి మాటలు విను, వాడి ఉపదేశం, వాడి సందేశం, అధికంగా నీకు తోడ్పడతాయి. అంటే పుస్తకాలలో చదివిన దాని కంటే బ్రహ్మానుభవం పొందిన వాడు బ్రహ్మము గురించి మాట్లాడుతుంటే, ఆ మాటలు మీకు హృదయానికి గట్టిగా పడతాయి. మీ ఆధ్యాత్మిక పురోగతికి, మానసికంగా ఎదగటానికి, జ్ఞానం సంపాదించడానికి, బ్రహ్మము గురించి నువ్వు పుస్తకాలలో చదివిన దాని కంటే, బ్రహ్మానుభవం పొందిన వారితోటి, ఆత్మానుభవం పొందిన వారి తోటి, సత్యాన్ని సాక్షాత్కరించుకున్న వారితోటి స్నేహం మీకు వారితోటి కనుక పరిచయం, వారి మాటలు శ్రవణం చెయ్యటం, వారితోటి నీకు అనుబంధం, మీకు అధికంగా తోడ్పడుతుంది. మీ ఆధ్యాత్మిక పురోగతికి బ్రహ్మానుభవం పొందిన వాడు చెబుతుంటే మీరు వింటే ఆరోజుకారోజు మీకు పరిణితి వస్తుంది. ఎంతో అభివృద్ధిలోకి వస్తారు.

మన మనస్సు వికసించటం కోసం, మన మనస్సుని క్రమ శిక్షణలో పెట్టడం కోసం, ఒకోసారి భగవంతుడు కొన్ని కొన్ని కష్టాలను కూడా పంపిస్తూ ఉంటాడు. మన తిరోగతికి కాదు మన పురోగతికే ఇదంతా భగవంతుడు చేస్తున్నాడు. భగవంతుడు ఒక్కొక్కసారి మనకు కష్టాలను పంపించినప్పటికీ, ఆ కష్టాలను కూడా ప్రసాదంగా స్వీకరించే స్థితి మన మనస్సుకి అలవాటు పడాలి. ఆధ్యాత్మిక పురోగతికి ఎవరైతే అభ్యాసం చేస్తున్నారో, వాళ్లతో పరిచయం వల్ల, మీకు కూడా అభ్యాసం చెయ్యాలి అనే కుతూహలం కలుగుతుంది. కేవలం పాండిత్యం పెద్దగా లాభించదు. శాస్త్రాలలో అనేకమంది పండితులు ఉండచ్చు, ఇక్కడ జ్ఞాన పాండిత్యం కావాలి అంటున్నారు భగవాన్. భాషా పాండిత్యం కాదు, శాస్త్ర పాండిత్యం కాదు, మీకు జ్ఞాన పాండిత్యం కావాలి. జ్ఞానంలో పండితుడు అవ్వాలి. భాషలో కాదు, వ్యాకరణంలో కాదు, జ్ఞాన పండితుడివి కావాలి. దేంట్లో పండితుడు కావాలి? జ్ఞాన పండితుడు అవ్వాలి, జ్ఞాన జ్యోతి అవ్వాలి. ఎవరికైతే జ్ఞాన జ్యోతి తన హృదయంలో వెలిగిందో, ఎవరికైతే జ్ఞాన పాండిత్యం కలిగిందో, ఎవడైతే జ్ఞాన పండితుడో వాడి వల్ల నువ్వు లాభం పొందుతావు.

జ్ఞాని దేహాన్ని ధరించి ఉంటే చాలు అనేవారు భగవాన్. అతని ద్వారా లోకానికి ఎంతో మేలు జరుగుతుంది. అందుచేత మీకు కనుక ఆత్మానుభవం అయితే, మీ హృదయంలో జ్ఞాన జ్యోతి కనుక వెలిగించబడితే, మీ ద్వారా తోటి సమాజానికి మీకు తెలియకుండానే ఎంతో మేలు జరుగుతుంది. ఎవడికైతే ఆత్మానుభవం కలిగిందో, వాడికి లౌకికమైన చదువులు, లౌకికమైన పాండిత్యాలు, లౌకికమైన ఐశ్వర్యాలు, లౌకికమైన కీర్తులు, ఏమీ వాడికి రుచించవు, ఇవన్నీ మూట కట్టి సముద్రంలో పడేద్దామా అనిపిస్తుంది జ్ఞాన పండితుడికి. మీరు పొందిన అనుభవం ముందు అవి అన్నీ అటువంటివి. మీరు అందరూ రత్నాల తోటి సమానం. రత్నానికైనా మెరుగు పెట్టాలి. మెరుగు పెడితేనే కాని దానికి ప్రకాశం రాదు. అందుచేత ఎప్పుడైనా భగవంతుడు మీకు కష్టాలు పంపిస్తే, మిమ్మల్ని మెరుగు పెట్టడానికే కాని మిమ్మల్ని పాడు చెయ్యటానికి కాదు. రత్నానికి మెరుగు పెడితేనే కాని ఏ విధంగా అయితే ప్రకాశం రాదో, అదే విధంగా భక్తులు అయిన మీకు అప్పుడప్పుడు కష్టాలు పంపించినప్పటికీ, మిమ్మల్ని మెరుగు పరచటానికి, మిమ్మల్ని తీర్చి దిద్దటానికి, మీకు బ్రహ్మానుభవం కలగటానికి, మిమ్మల్ని ప్రిపేర్ చెయ్యటానికే భగవంతుడు ఇవన్నీ పంపిస్తున్నాడు కాని, మీ మీద ఇష్టం లేక కాదు. ప్రపంచంలో అన్ని ప్రేమల కంటే తల్లి ప్రేమ గొప్పది. అటువంటి తల్లి కంటే కూడా మనలని ఎక్కువ ప్రేమించేవాడు పరమేశ్వరుడు. ఈశ్వరుడి

మీద భక్తి లేని మూలాన ఆయన మీద మనకు ప్రేమ కూడా కుదరటం లేదు. ఎవరికైతే పరమేశ్వరుడి యందు భక్తి కుదిరిందో, వాడికి భగవంతుడి యందు ప్రేమ కూడా కలుగుతుంది. నాకు భగవంతుడి యందు ప్రేమ కలగక పోవటానికి కారణం నాకు భక్తి లేదు. అందుచేత మీరు ఏ గుడిలోకి వెళ్ళినా, ఎక్కడికి వెళ్ళినా, నాకు భక్తిని ప్రసాదించండి అని భగవంతుడిని ప్రార్థించండి. మీకు భక్తి కనుక కుదిరితే, ఏది అవసరమో అన్నీ మీకు వచ్చేస్తాయి. మీ జీవితాలు అన్నీ కూడా శాంతిమయం అవుతాయి, మీ జీవితాలు ఎంతో ఆనందమయం అవుతాయి. అందుచేత ఏ దేవాలయం తిరిగినా, మీరు పెద్దల దగ్గరకు వెళ్ళినా, మీరు కోరుకునేది ఒక్కటే నాకు భక్తిని ప్రసాదించు అని మీరు కోరుకోండి. ఎందుచేత అంటే మనం అందరం కూడా భక్తి గురించి వింటున్నాం. భక్తి గురించి శ్రవణం చేస్తున్నాం. భక్తి గురించి మననం చేస్తున్నాం. కాని భక్తిని మనం ఇంకా రుచి చూడలేదు. ఆ రుచి చూడకపోవడం వలన భక్తి గురించి మనకు interest కలగటం లేదు. అమృతాన్ని ఒకసారి రుచి చూస్తే ఇక ఎంతమంది కాదు అన్నా దానిని విడిచి పెట్టలేము. అదే విధంగా భక్తిని కనుక ఒకసారి రుచి చూస్తే, ఎంతమంది కాదు అన్నా దానిని విడిచి పెట్టలేము. ఈ మధ్య ఒక పెద్ద వ్యాపారస్తుడు నా దగ్గర ఒక మాట చెప్పాడు - పూర్వం నాకు డబ్బు విలువ తెలియలేదు. ఇప్పుడు బాగా సంపాదించాను. బాగా సంపాదించిన తరువాత డబ్బు రుచి నాకు తెలిసింది. సంపాదన విడిచి పెట్టలేకపోతున్నాను అని చెప్పాడు. అదే విధంగా భక్తుడు కూడా భక్తిని రుచి చూడాలి, ఆ భక్తి రుచి ఎవడికైతే అందిందో, వాళ్ళు భక్తిని విడిచి పెట్టలేరు. రుచి మనకు తెలియాలి. మీరు పాయసం రుచి చూసారు అనుకోండి, మళ్ళీ పాయసం మీదకి మీకు తెలియకుండానే మీ ఇంద్రియం ఎలా వెళుతుందో, అదే విధంగా భక్తిని కనుక మీరు రుచి చూస్తే, మీ మనస్సు వెళ్ళి భగవంతుడి మీద వాలుతుంది. ఆ రుచి మనకు తెలియాలి. మనం బట్ట అవసరం అనుకుంటున్నాం. తిండి అవసరం అనుకుంటున్నాం. లేకపోతే ఇల్లు అవసరం అనుకుంటున్నాం. భౌతికంగా మనం ఇవన్నీ ఎలా అయితే అవసరం అనుకుంటున్నామో, అలాగే అహంకారాన్ని తొలగించు కోవడం కూడా అవసరం అని మీరు ఎప్పుడు తెలుసుకుంటారు? మోక్షాన్ని పొందటానికి, ఆనందాన్ని అనుభవించటానికి మీరు అహంకారాన్ని తొలగించుకోవడం అవసరం. దాని కోసం మీరు ప్రయత్నం చెయ్యాలి. నిష్కామ భక్తి వల్ల, నిష్కామ కర్మ వల్ల, నిష్కామ సేవ వల్ల అహంకారం తొలగుతుంది. సకామంగా పని చేస్తుంటే మనకు అహంకారం తొలగదు. నిష్కామంగా పని చేస్తుంటే అహంకారం తొలగుతుంది. అంటే పని చేస్తూ ఉండాలి ఫలితం యందు

మనం ఆశ పెట్టుకోకూడదు. ఫలితం వస్తే రావచ్చు. ఫలితం దానంతట అదే వస్తే మీకు హాని చేయదు. కోరిక లేకుండా ఫలితం వచ్చింది అనుకోండి అది మిమ్మల్ని బంధించదు. కోరికను పెట్టుకున్నారు అనుకోండి అది తప్పనిసరిగా మిమ్మల్ని బంధిస్తుంది. రాగం ఒక సుడిగుండం, ద్వేషం ఒక సుడిగుండం, ఇవి రెండు పెద్ద పెద్ద సుడిగుండాలు. ఆ సుడి గుండాల్లో మనం పడిపోవటం వల్ల ఈ మనస్సుని లోపలకి తోలుకు వెళదామన్నా తోలుకు వెళ్లలేక పోతున్నాం. అంటే వస్తువుల పట్ల, వ్యక్తుల పట్ల, మనకున్న రాగ ద్వేషాల వల్లే మన మనస్సు బయటకి వచ్చేస్తుంది. అంటే లోపల దృష్టి మనకు కలగటం లేదు. సుడిగుండాలు ఎక్కడ ఉన్నాయి? మనలోనే ఉన్నాయి. ఇష్టం ఒక సుడిగుండం, అయిష్టం ఒక సుడిగుండం, కొన్ని వస్తువుల మీద ఇష్టం, కొన్ని వస్తువుల మీద అయిష్టం, కొంతమంది వ్యక్తుల మీద ఇష్టం, కొంతమంది వ్యక్తుల మీద అయిష్టం, ఇలా వస్తువుల మీద, వ్యక్తుల మీద ఎంతకాలం అయితే ఇష్టా అయిష్టాలతో మన మనస్సు తిరుగుతూ ఉంటుందో, అంతకాలం మన మనస్సు బయటకి వచ్చేస్తుంది కాని లోపలకి వెళ్లలేము.

ఇవే సుడిగుండాలు అన్న సంగతి మనకి తెలియటం లేదు. ఆ సుడి గుండాలలో వెళ్లి మనం పడిపోతున్నాం అందుచేత మనకి ఆత్మజ్ఞానం కలగటం లేదు. ఎవరికైతే సమానమైన భావం ఉందో వారికే మనస్సు లోపలకి వెళుతుంది కాని సమానమైన భావం లేని వాడికి లోపలకి వెళ్లదు. మీకు అప్పుడప్పుడు సంతోషం వస్తే మనం సుఖ పడిపోతున్నాం అంటున్నారు. అది యదార్థమైన సుఖం కాదు. కేవలం అది సంతోషమే. సంతోషం మనస్సులో వచ్చే ఒక పొంగు, దుఃఖం మనస్సులో వచ్చే ఒక కుంగు. అందుచేత సంతోషం అనేది, దుఃఖం అనేది మీ మనస్సుకి పరిమితం అయి ఉన్నాయి. నిజమైన సుఖం, నిజమైన శాంతి, మనస్సులో లేనే లేదు. అది ఎక్కడ ఉంది? హృదయంలో ఉంది. ఆత్మలో ఉంది.



**మీరు చేసే సాధనల కన్నా, ఒక్క ఈశ్వరుడి యందు ఇష్టం వలన ఎక్కువ దయ పొందుతారు. పరమేశ్వరుడి పట్ల మీరు ప్రీతిని పెంచుకుంటే, మీ జీవితం ఎంతగానో మారిపోతుంది. ప్రయాణం చేస్తున్నట్టు కూడా తెలియదు. గమ్యం చేరిపోతారు.**

మనం నేను నేను అంటున్నాం. లోపల నేను అనేది ఒకటి ఉందని మన అమ్మ నేర్పిందా? మనకు అమ్మ నేర్పలేదు. పోనీ ఇతరులు ఎవరైనా నేర్పారా? ఎవరూ నేర్పలేదు. మనకు సహజంగా నేను నేను అనేది ఉంది. లోపల భగవంతుడు ఉన్నాడు. ఆ భగవంతుడి లోంచి వచ్చిన ఒక రశ్మే, భగవంతుడు లోంచి వచ్చిన ఒక అంశే, నేను నేను అనే దానిని మనకు తెలియ పరుస్తుంది కాని, ఈ నేను గురించి ఒకళ్ళు నేర్పక్కరలేదు. నువ్వు ఉన్నావురా అబ్బాయి లోపల అని మనకు మన అమ్మ చెప్పిందా, ఎవరు చెప్పకుండా, ఏ గ్రంథం చదవక్కరలేకుండా, పెద్దలు చెప్పే మాటలు వినకుండా, ఈ నేను అనేది నాకు ఉందని నాకు తెలుస్తుంది. లోపల భగవంతుడు ఉన్నాడు, ఆ భగవంతుడిలోని అంశే నేను కింద వస్తుంది. లోపల భగవంతుడు లేకపోతే ఈ నేను అనే సామర్థ్యం కూడా మనకు లేదు. ఈ నేను ఎవరో తెలుసుకో అని భగవాన్ చెప్పారు. సముద్రానికి కెరటం వల్ల వచ్చే తుంపరలకి ఎటువంటి సంబంధం ఉందో, నీలో ఉన్న భగవంతుడికి నువ్వు చెప్పే నేనుకి అటువంటి సంబంధమే. నేను నేను నేను అనేది ఒక తుంపర. సముద్రం ఎటువంటిది? అందులో ఉన్న తుంపర ఎటువంటిది? మీ హృదయంలో సముద్రం లాంటి భగవంతుడు ఒకడు ఉన్నాడు. నువ్వు చెప్పే నేను సముద్రానికి సంబంధించిన నేను కాదు. సముద్రంలో ఎన్నో తుంపరలు ఉంటాయి. అందులో నేను నేను అనేది ఒక తుంపర. మాకు ఆనందం అక్కర్లేదు అని మీలో ఎవరైనా చెబుతారా? అన్ని కులాలకి, మతాలకి ఆనందం కావాలి. అన్ని వర్గాలకి ఆనందం కావాలి, నల్లగా ఉన్న వాళ్లకి ఆనందం కావాలి, తెల్లగా ఉన్న వాళ్లకి ఆనందం కావాలి, ఎర్రగా ఉన్న వాళ్లకి ఆనందం కావాలి, నల్లగా ఉన్న వాళ్లలో ఏ ఆత్మ ఉందో, తెల్లగా ఉన్న వాళ్ళ లోను అదే ఆత్మ ఉంది. తెల్లగా ఉన్న వాళ్లలో ఏ ఆత్మ ఉందో, ఎర్రగా ఉన్న వాళ్లలో ఆ ఆత్మే ఉంది. కరెంటు ఎరుపా? ఎరుపు కాదు, కరెంటు నలుపా? నలుపు కాదు, కరెంటు తెలుపా? తెలుపు కాదు. అయితే బల్బు తెలుపైతే మనకు తెల్లగా కనిపిస్తుంది. బల్బు ఎరుపు అయితే ఎరుపుగా కనిపిస్తుంది. బల్బు పసుపు అయితే పసుపుగా కనిపిస్తుంది. ఇందులో కరెంటు ఎరుపు కాదు, నలుపు కాదు, తెలుపు కాదు. అయితే మన శరీరాలవి రంగులు. తెలుపని, నలుపని, ఎరుపని, పొట్టిఅని, పొడుగని, అన్నీ మీ శరీరాలలోనే ఉన్నాయి. ఇన్ని వికారాలు మధ్యన ఆనందం సమానంగా, బ్రహ్మం సమానంగా ఉంది. అందుచేత నాకు బ్రహ్మము అక్కర్లేదు, నాకు దేవుడు అక్కర్లేదు అని మీలో ఎవరైనా అంటే, నాకు ఆనందం అక్కర్లేదు అని చెప్పటం లాంటిది. నాకు ఆనందం వద్దండి అని

చెప్పేవారు ఎవరైనా ఉన్నారేమో చెప్పండి. దేవుడు అంటే ఎవరు? ఆనందం. రాముడు అంటే ఎవరు? ఆనందం. కృష్ణుడు అంటే ఎవరు? ఆనందం. రమణుడు అంటే ఎవరు? ఆనందం. రామకృష్ణుడు అంటే ఎవరు? ఆనందం. దేవుడంటే ఆనందం, ఇప్పుడు చెప్పండి దేవుడు అక్కర్లేని వాళ్ళు ఎవరు ఉన్నారు మీలో? లౌకికమైన గొప్పల తోటి ఇప్పుడు మనం ఏమైనా అలంకరించుకొంటుంటే, ఆత్మానుభవం పొందక ముందు, ఆనందానుభవం పొందక ముందు అవి మీకు గొప్పగా కనిపించవచ్చు. ఎప్పుడైతే మీకు బ్రహ్మానుభవం కలిగిందో, అవన్నీ మీకు బరువుల కిందే అనిపిస్తాయి. మనుషులు అందరూ సుఖాలను కోరుకుంటున్నారు. ఆనందం లోకంలో ఉందని నువ్వు అనుకుంటున్నావు. ఆనందం లోకంలో లేదు, ఎక్కడుంది? ఆనందం ఆత్మలో ఉంది, ఈ అహంభావం అనే గడప, ఈ మనస్సు అనే గడప, ఈ దేహబుద్ధి అనే గడప దాటి వెళ్లి ఆ గుహలో నువ్వు పడ్డావా? సద్గురువు యొక్క సహాయం వల్ల, శాస్త్రం యొక్క సహాయం వల్ల, ఈశ్వరుడు యొక్క సహాయం వల్ల, ఎప్పుడైతే నీ హృదయ గుహలోకి నువ్వు వెళ్లి పడ్డావో, అసలు నువ్వు ఊహించనటువంటి నీ ఇంద్రియాలు కాని, నీ మనస్సు కాని, నీ తలంపులు కాని, నీ ఆలోచనలు కాని అతీతమైనటువంటి, నీ ప్రజ్ఞకి అతీతమైనటువంటి, ఒక పరమ శాంతి, ఉత్కృష్టమైన శాంతి, ఉదాత్తమైన శాంతి, మహోన్నతమైన శాంతి, తరుగు లేనటువంటి శాంతి, ఎంత అనుభవించినా అది తరగదు, అటువంటి శాంతి, అటువంటి ఆనందం, అటువంటి సుఖం నీకు దొరుకుతుంది. ఎప్పుడు? ఈ అహంభావం అనే గడప, ఈ మనస్సనే గడప, ఈ దేహబుద్ధి అనే గడప దాటి వెళ్లి ఆ గుహలో పడ్డావా, తరుగు లేనటువంటి శాంతి నీకు దొరుకుతుంది.

మీ దగ్గర బాగా డబ్బు ఉంది అనుకోండి, ఖర్చు పెట్టడం మొదలు పెట్టారు అనుకోండి, ఎంత డబ్బు ఉన్నా తరిగిపోతుంది. రాసులు కూడా తరిగిపోతాయి. హృదయంలో ఉన్న శాంతి అటువంటిది కాదు. ఎంత అనుభవించినా తరగదు. బ్రహ్మానుభవం పొందటం కోసం ప్రతీ రోజు పుడుతూనే ఉండాలి. ఏరోజుకారోజే మన పుట్టిన రోజు అనుకుని, మనం ప్రయత్నం చేస్తేనే గాని ఈ అనుభవం మనకు రాదు అన్నారు జాతిపిత గాంధీ. అందరం పనులు చేసుకుంటున్నాం. కాని పనిని యోగంగా చెయ్యాలి. అందరికి భక్తి ఉంది. మనకున్న భక్తిని యోగంగా మార్చాలి. మనకున్న జ్ఞానాన్ని యోగంగా మార్చాలి. ఎవడైతే తను చేసుకుంటున్న పనిని యోగంగా మార్చాడో, ఎవడైతే తనకున్న భక్తిని, తనకి ఈశ్వరుడు మీద ఉన్న ప్రేమని యోగంగా మార్చాడో, అప్పుడు ఏమి అవుతుంది అంటే మీరు చేస్తున్న

పని యోగంగా మారితే అహంకారం నశిస్తుంది. మీ భక్తి యోగంగా మారిపోతే మీ అహంకారం నశిస్తుంది. మీ జ్ఞానం యోగంగా మారితే మీ అహంకారం నశిస్తుంది. కృష్ణుడు అదే అర్జునుడితో చెప్పాడు. నువ్వు చేస్తున్న పని యోగంగా మారిపోతే ఎంత మందిని చంపినా నీకు పాపం అంటదు. నీ పనిని యోగంగా మార్చుకో, నీ భక్తిని యోగంగా మార్చుకో, నీ ధ్యానాన్ని యోగంగా మార్చుకో, నువ్వు చేస్తున్న పని యోగంగా మారిపోతే, ఆత్మానుభవం పొందటం కోసం, బ్రహ్మానుభవం నువ్వు పొందటం కోసం, ఏ దేహబుద్ధి అయితే నీకు అడ్డు వస్తుందో, ఏ అహంకారం అయితే నీకు అడ్డు వస్తుందో, అది వేరుతో సహా నశిస్తుంది. వృక్షానికి వేరు ఎటువంటిదో ఈ మనస్సు అనే వృక్షానికి దేహబుద్ధి వేరు లాంటిది. ఆ వేరు తెగిపోతేనే కాని నీకు బ్రహ్మానుభవం చిక్కదు. నీకు సుఖం కావాలా? శాంతి కావాలా? ఆనందం కావాలా? జ్ఞానం కావాలా? భక్తి కావాలా? అన్నీ కావాలంటే దేవుణ్ణి ప్రార్థించు. మీ శరీరానికి స్నానం ఎలా అవసరమో మీ మనస్సుకి కూడా ప్రార్థన అవసరం. అందుచేత నీకు ఏది కావాలన్నా దేవుణ్ణి ప్రార్థించు. దేవుడు నీకు ఇస్తాడు. మనం దేవుణ్ణి పొందాలి అనుకుంటే పొందలేము. ఆయన అనుగ్రహం ఉంటే ఆయన్ని పొందుతాము. అంటే దేవుడి కోసం మాట్లాడు, దేవుడి కోసం జీవించు, దేవుడి కోసం మరణించు, దేవుడి కోసం ప్రార్థించు, నీకు అన్నీ ఇస్తాడు. మహాభారతంలో ఒక మాట ఉంది - ఆత్మానుభవం పొందటం కోసం, ఆత్మజ్ఞానం సంపాదించటం కోసం, ఆత్మశాంతిని సంపాదించటం కోసం, ఎవడైతే నిరంతరం తన కాలాన్ని, తన అవకాశాన్ని, తన తెలివిని ఉపయోగించుకుంటున్నాడో వాడు నిజమైన పండితుడు. ఇది నేను కల్పించటం లేదు, భారతంలో వేదవ్యాసుడు చెప్పాడు. మీ కుటుంబం నడుపుకోవటానికి ఎంత వరకు అయితే మీకు అవసరమో, అంతవరకు మీ ఇంద్రియాలను ఉపయోగించుకోండి, మీ మనస్సుని ఉపయోగించుకోండి. మిగతా కాలాన్ని, భగవంతుడు మీకు ఇచ్చినటువంటి అవకాశాలని, అన్నిటినీ ఆత్మ జ్ఞానం సంపాదించటం కోసం ఎవడైతే ఉపయోగించుకుంటున్నాడో, వాడు యదార్థంగా పండితుడు. కొంతమంది అడగకుండా సలహాలు చెబుతారు. అలా చెప్పకూడదు. అడగకుండా సలహాలు చెబితే ఆ సలహాలకు విలువే అసలు ఉండదు. ఇతరుల వ్యవహారాలలో సాధ్యమైనంత వరకు నువ్వు కలుగజేసుకోకు అన్నారు భగవాన్. ఇతరుల వ్యవహారాలలో మనం ఎక్కువ కలగజేసుకుంటే మనకు తెలియకుండా మన అహంకారం పెరుగుతూ ఉంటుంది. ఆత్మానుభవం పొందడం కోసం ఎవడైతే తన జీవితం అంతా ఉపయోగించు కుంటున్నాడో, వాడు నిజమైన పండితుడు. మీ సమస్యల కోసం

మీరు కృషి చేసుకోవచ్చు, ఫలితం మటుకు దేవుడి చేతికి విడిచి పెట్టేయాలి. ఈశ్వర సంకల్పాన్ని మీరు గౌరవించడం నేర్చుకుంటే, మీ సమస్యలు అన్నిటికి పరిష్కారం దొరుకుతుంది. చేతిలో ఉన్న పని మనం చెయ్యాలి కాని ఫలితాన్ని ఈశ్వరుడికి విడిచి పెట్టేయాలి. ఆ ప్రయత్నం ఒకొక్కసారి జరుగుతుంది. ఒకొక్కసారి జరగదు. ఈశ్వరుడి సంకల్పం అలా ఉంది. ఈశ్వరుడి సంకల్పాన్ని మనం గౌరవించాలి అని మీరు అనుకుంటే అప్పుడు ఏమి అవుతుంది అంటే మీకు దుఃఖం ఆరిపోతుంది. మీరు చేసే ప్రయత్నం చేయొచ్చు. కాని ఫలితాన్ని ఏమి చెయ్యాలి? ఈశ్వర సంకల్పానికి వదిలేయాలి. పని మనం చెయ్యాలి కాని దేవుడి సంకల్పం మీద గౌరవం ఉండాలి. ఈశ్వర సంకల్పమే నెరవేరు గాక అని మనం అనుకుంటే, మనకి ఎంత దుఃఖం అయినా ఆరిపోతుంది. బండెడు దుఃఖం ఉంది అనుకోండి హృదయంలో, దేవుడి సంకల్పం యందు గౌరవం ఉంటే ఆ దుఃఖం అంతా ఆరిపోతుంది. కొంతమంది జరిగిపోయిన గొడవలు అన్నీ తలపెట్టుకుంటూ ఉంటారు. అది అలా చేస్తే బాగుండును, ఇది ఇలా చేస్తే బాగుండును, అప్పుడు అలా చేశాం, ఇప్పుడు ఇలా చేశాం, ఇలా అనుకోవడం కంటే ఈశ్వరసంకల్పం అలా ఉంది, అలా జరిగింది అని ఒక నిర్ణయానికి మీరు వచ్చేస్తే, గతం యొక్క దుఃఖం మిమ్మల్ని వెంటాడదు. మీరు చేసే ప్రయత్నం మీరు చేసుకుంటూ ఉండచ్చు. ఈశ్వర సంకల్పాన్ని గౌరవించడం మీరు నేర్చుకోండి.

మీ అందరికి తెలివి తేటలు ఉన్నాయి. కాని మన అందరికంటే భగవంతుడు తెలివైన వాడు. మనకు కొన్ని విషయాలు తెలుసు, కొన్ని విషయాలు తెలియవు. కానీ భగవంతుడికి తెలియని విషయం ఈ సృష్టిలో లేదు. తెలివి భగవంతుడిదే, వివేకం భగవంతుడిదే, శక్తి భగవంతుడిదే. మనం ఆయన చేతులలో కేవలం బొమ్మలం మాత్రమే. ఆడుతున్నట్టుగా మనకి అనిపిస్తున్నప్పటికీ ఆడించే వాడు ఆయనే. మీకు బాగా ముఖ్యమైన పనులు కూడా

**మనం చేసేది లోక విచారణ, కానీ ఆత్మ విచారణ, దైవ చింతన చేస్తున్నాం అనుకొంటున్నాము. అంతర్యామిగా ఉన్న భగవంతుడిని మనం మోసం చేయలేము.**



ఒకొక్కసారి అవుతాయి ఒకొక్కసారి అవ్వవు. ఆ పని అయిపోతే మీకు బాగా పొగరుబోతు తనం పెరిగిపోతుంది. గర్వం పెరుగుతుంది అని ఆయన అనుకుంటే, మీకు ఆ పని ఆపు చేస్తాడు. ఏ చేనులో పడితే ఆ చేనులో పడిపోతుంది. దానికి ఒక క్రమ శిక్షణ లేదు అనుకున్నప్పుడు, దాని కాళ్లకు బంధాలు వేస్తారు. ఆ దూడ అంటే భగవంతుడికి ఇష్టం లేదా? ఇష్టం ఉంది కానీ దానిని కంట్రోల్ చెయ్యడానికి ఆవిధంగా బంధాలు వేస్తాడు. మీరు అనుకున్న పనులు కూడా ఒకొక్కసారి జరగవు. ఎందుచేత? మిమ్మల్ని కంట్రోల్ లో పెట్టడానికే భగవంతుడు చేస్తున్నాడు కాని, ఆయనకి ఇవ్వగల శక్తి ఉంది. తాత్కాలికంగా కంట్రోల్ చేస్తున్నాడు. ఈ జన్మలో కాకపోయినా వచ్చే జన్మలో అయినా మీ కోరికలు అన్నీ తీరుస్తాడు. ఎప్పుడు? మీరు క్రమశిక్షణ నేర్చుకున్నప్పుడు. మన భారత దేశంలో బిర్లా ఒక గొప్ప ధనవంతుడు. ఆయన ఏ సంస్థకి ఏమి ఇచ్చినా అనేవాడు, నాకు ఇచ్చినవాడు భగవంతుడు. నేను ఎవరికి అయితే ఇస్తున్నానో వాడు భగవంతుడే. ఇందులో నా ప్రమేయం ఏమి ఉంది? నేను కేవలం పనిముట్టుని మాత్రమే అనేవారు. ఆ భావన కనుక మనకి ఉంటే, నేను దానం చేశాను, నేను ధర్మం చేశాను, ఇటువంటి అహంకార భావనలు అన్నీ తగ్గిపోతాయి. మీరు పని చెయ్యండి, ఫలితాన్ని ఈశ్వరుని పాదాల దగ్గర పెట్టండి. మీ మనస్సు ఆనందంగా మారిపోతుంది, మీ మనస్సు శాంతిగా మారిపోతుంది. అప్పుడు ఏమి అవుతుంది అంటే మీకు ఫలితం వస్తుంది, ఆనందం వస్తుంది, మీ అహంకారం నాశనం అయిపోతుంది. ఈ లోకాన్ని ఎవడైతే నడిపిస్తున్నాడో, ఈ లోకానికి కంట్రోలర్ ఎవడో, వాడికే మీ పని యొక్క ఫలితం సమర్పించండి. పుష్పాన్ని దేవుడి పటం దగ్గర ఎలా పెడుతున్నారో అలాగే పని వల్ల వచ్చే ఫలితాన్ని కూడా ఆయనకే సమర్పించండి. ఎవరికి? పరమేశ్వరుడికే సమర్పించండి. ఈశ్వరభావన తోటి మీరు ఆ పని చేయండి. పరమేశ్వరుడు అందరి హృదయాలలోనూ ఉన్నాడు. మనం చేసే అన్ని పనులు చూస్తాడు. మన మనస్సులో వచ్చే ఆలోచనలకి కూడా సాక్షిగా మన హృదయంలో ఉన్నాడు. భగవంతుడు సంతోషించే పనులు నువ్వు చెయ్యటం ప్రారంభిస్తే, భగవంతుడు నిన్ను ఎక్కువ ఇష్టపడి, ఆయనకు నీ పట్ల ప్రీతి కలిగి, హృదయంలో ఉన్నవాడు నీకు వెంటనే వ్యక్తమవుతాడు. అందుచేత నువ్వు చేసే ప్రతీ పని నువ్వు భగవంతుడికి సమర్పించు, భగవంతుడికి ప్రసాదంగా ఇవ్వు. మీరు రాముడిని ఆరాధించండి, శివుడిని ఆరాధించండి, కృష్ణుడిని ఆరాధించండి, ఎవరిని ఆరాధించినప్పటికీ ఆరాధన యొక్క ప్రయోజనం అజ్ఞానం తొలగించుకోవడం కోసమే.

నిష్కామ భక్తి, నిష్కామ కర్మ, నిష్కామ సేవ వల్ల వచ్చే ప్రయోజనం అంతా కూడా అహంకారాన్ని తొలగింప చేసుకోవడం కోసమే, మీరు మంచి చేయండి, చేసి మర్చిపోండి. మిగతా విషయాలు అన్నీ ఈశ్వరుడు చూసుకుంటాడు. ఆయన మనకంటే తెలివి కలవాడు, మనకంటే వివేకవంతుడు, మనకంటే బుద్ధిమంతుడు. అందుచేత భగవంతుడికి అన్నీ విడిచిపెట్టండి. మీ చేతిలో ఉన్న మంచి మటుకు మీరు చేస్తూ ఉండండి. దానివల్ల మీ అజ్ఞానం పలుచబడుతుంది. బ్రహ్మంను తెలుసుకోవాలంటే బ్రహ్మజ్ఞానం అవసరం. బ్రహ్మ నిష్ఠ అవసరం, బ్రహ్మ నిష్ఠ వల్ల బ్రహ్మము తెలియబడుతుంది. కొంతమంది ప్రాణాయామం చేయమంటారు, ప్రాణాయామం యొక్క ప్రయోజనం కూడా మనో నాశనమే. బ్రహ్మ జ్ఞానం కనుక మనం పొందితే మరల జనన మరణాలు కలగవు. ఈశ్వరుడు మన హృదయంలో సజీవంగా ఉన్నాడు. మనలని విడిచి పెట్టి ఈశ్వరుడు లేడు. ఆ ఈశ్వర అనుభవం ఎప్పుడైతే పొందామో, ఇంక మనకు జనన మరణాలు కలగవు, ఆత్మ ప్రాప్తికి ఈశ్వరుడి అనుగ్రహం అవసరం. ఆత్మ ప్రాప్తికి ఈశ్వరుడి దయ అవసరం. ఈశ్వరుడి దయ మనకి ఎలా కలుగుతుంది? మనం ఏ విధంగా ప్రవర్తిస్తే, ఏ విధంగా ఆచరిస్తే, ఏ విధంగా మాట్లాడితే, ఏ విధంగా మన జీవితాన్ని తీర్చి దిద్దుకుంటే, ఈశ్వరునికి సంతోషం కలుగుతుందో, ఆ పనులు చెయ్యటం వల్ల మనకు ఈశ్వర అనుగ్రహం కలుగుతుంది. ఈశ్వర అనుగ్రహం లేకుండా ఈశ్వరుణ్ణి పొందలేము. ఉపనిషత్తులో ఒక మాట ఉంది, దేవుణ్ణి తెలుసుకోవాలి అనుకొనేవాడికి ఎవడికీ దేవుడు తెలియబడడు, నేను దేవుణ్ణి తెలుసుకోవాలి, నేను దేవుణ్ణి తెలుసుకోవాలి అన్నంత మాత్రాన నాకు దేవుడు తెలియబడడు. దేవుడు ఎవడికైతే తెలియబడాలి అనుకుంటాడో వాడికి తెలియబడతాడు. అనేక మంది ఈశ్వరుడిని తెలుసుకోవటానికి సాధన చేయొచ్చు. కాని అందరికి ఈశ్వరుడు తెలియబడడు. ఎవరికి అయితే ఈశ్వరుడు తెలియబడాలి అనుకుంటున్నాడో వాడికి మాత్రమే ఈశ్వరుడు తెలియబడతాడు. ఎవరైతే నూటికి నూరు పాళ్ళు ఈశ్వర సంకల్పాన్ని గౌరవిస్తారో, కష్టం వచ్చినా, సంతోషం వచ్చినా ఈశ్వర ప్రసాదంగా స్వీకరిస్తారో, వాడికే ఈశ్వరుని దయ, ఈశ్వరుని అనుగ్రహం కలుగుతుంది. ఈశ్వరుడి దయ మన మీద ఉండాలని మనం కోరుకుంటాం. కాని మనం ఎవరి మీద దయ చూపించము, ఇంక మనకి ఈశ్వరుడి దయ ఎలా వస్తుంది? మిగతా సద్గుణాలు మీలో ఉన్నా లేకపోయినా, దయ అనే సద్గుణం కనుక మీలో ఉంటే తప్పనిసరిగా ఈశ్వరుడి దయ మీకు వస్తుంది. ఈ ఒక్కటి జ్ఞాపకం

ఉంచుకోండి. మీరు ఏ విధంగా అయితే ఈశ్వరుని దయ అడుగుతున్నారో, అలాగే మీ తోటి మానవుల పట్ల మీరు కొంచెం దయ చూపించండి. ఆ ఒక్క దయా గుణమే మీకు ఈశ్వర అనుగ్రహం తెచ్చి పెడుతుంది. మీలో ఎవరైతే కరుణామయుడో, మీలో ఎవరైతే దయా స్వరూపుడో, దేవుడు అనుగ్రహం తప్పనిసరిగా వాడు పొందటానికి అర్హుడు. మీరు ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి. రమణానుగ్రహం మీకు, నాకే సొంతం కాదు. రమణాశ్రమంలో ఉన్న నలుగురికి సొంతం కాదు. ప్రపంచంలో ఎక్కడ సహృదయం ఉన్నవారు ఉన్నప్పటికీ, ప్రపంచంలో సద్బుద్ధి ఉన్నవాడు ఎవడైనా ఆ రమణానుగ్రహానికి పాత్రుడే. మీకు సహృదయం ఉంది అనుకోండి, మీకు సద్బుద్ధి ఉంది అనుకోండి దేవుడి అనుగ్రహానికి మీరు పాత్రులే. నాకు మోక్షమే కావాలి అనేటువంటి మోక్ష భావాన్ని నిరంతరం మనస్సులో పెట్టుకుని జీవితాన్ని ప్రారబ్ధానికి వదిలేయండి. అది కావాలి, ఇది కావాలి అని భగవంతుడిని అడగొద్దు. ఇవాళ ఉండి రేపు వెళ్ళిపోయే వస్తువులు కాదు. ప్రారబ్ధంలో మీరు అనుభవించవలసిన యోగ్యత ఉంటే అడగకుండానే వస్తుంది. భగవాన్ అరుణాచలం వచ్చిన కొత్తలో ఆకలి బాధ, ఇప్పుడు అజీర్తి బాధ. అప్పుడు అలా ఉండాలి అనుకోలేదు. ఇప్పుడు ఇలా ఉండాలి అనుకోలేదు. దేహ ప్రారబ్ధాన్ని బట్టి అప్పుడు అలా ఉండవలసి వచ్చింది. ఇప్పుడు ఇలా ఉండవలసి వచ్చింది అనేవారు భగవాన్. ఈ దేహాన్ని ప్రారబ్ధానికి విడిచి పెట్టేయండి. జరగవలసింది జరుగుతూ ఉంటుంది. ఎప్పుడు మీ దేహానికి ఏమి జరగాలో అది జరుగుతూ ఉంటుంది. కాని మీ భావన, మీ గమ్యం, మీ తలంపు, అన్నీ మోక్షం వైపుకి గురి పెట్టండి. కొంతమంది అంటూ ఉంటారు మాకు ఇంకా మరణం రాలేదు అని, అలా కూడా అనుకోకూడదు. ఈ దేహం ఏ ప్రారబ్ధం అనుభవించటానికి ఈ భూమి మీదకి వచ్చిందో ఆ ప్రారబ్ధం ఖర్చు అయిన వెంటనే మరుక్షణంలో దేహం పడిపోతుంది. ఒక గంట ముందు వెళ్ళమంటే వెళ్ళదు. ఒక గంట ఆగమంటే ఆగదు. అంటే దేహం ఏ ప్రారబ్ధాన్ని అనుభవించటం కోసం, ఏ అనుభవాన్ని పొందటం కోసం, ఈ భూమి మీదకి వచ్చిందో ఆ అనుభవం పూర్తి అయిన వెంటనే ఈ దేహం పడిపోతుంది. అందుచేత మనం చిరకాలం జీవించాలి అనుకోకూడదు. తొందరగా మరణించాలి అనుకోకూడదు. మీరు చేసే ప్రయత్నం సహజంగా ఉండాలి. అంటే మీరు మొఖం ఎలా కడుగుకుంటున్నారో, మీరు స్నానం ఎలా చేస్తున్నారో, అంటే ఇంట్లో రోజు చేసుకునే పనులు ఎంత సహజంగా చేసుకుంటున్నారో, ఈ సాధన కూడా అంత సహజంగా చేసుకు పోవాలి, ఇష్టం ఉన్న చోట కష్టం ఉండదు. ఆడంబరం లేకుండా మాట్లాడటం,

ఆడంబరం లేకుండా పనిచేయటం. ఆడంబరం లేకుండా జీవించటం. ఈ రకంగా మీరు సహజంగానే జీవించండి. సహజంగా చేసుకు పొండి, అయ్యో మేము ఎంతో సాధన చేసేస్తున్నాం అని మీరు అనుకోకండి. ఇతరుల కంటే మేము ఎక్కువ సాధన చేసేస్తున్నాం, మేము ఎంతో ధ్యానం చేసేస్తున్నాం, మేము ఎంతో పూజ చేసేస్తున్నాం ఇలాంటి విషయాలు మీరు పెంచుకుంటూ ఉంటే, ఎదుటివారు కంటే మీలో ఏదో ప్రత్యేకత ఉంది అనుకొంటూ ఉంటే మీరు సహజంగా చేయటం లేదు అని గుర్తు. మీరు చేసే పూజ, మీ జపం, మీ ధ్యానం, మీ విచారణ, naturalగా normalగా జరిగిపోవాలి కానీ ఏదో తెచ్చి పెట్టుకున్నట్టుగా ఉండకూడదు. కొంతమంది తెచ్చి పెట్టుకున్నట్టుగా మాట్లాడతారు. వికారంగా మాట్లాడతారు, ఆడంబరంగా మాట్లాడతారు. అందులో సహజత్వం ఉండదు, సహజం కానిది దేవుడు కాదు. నిర్మలం కానిది దేవుడు కాదు. చేసే పని సహజంగా చెయ్యాలి, నిర్మలంగా చెయ్యాలి. నిరాడంబరంగా చెయ్యాలి. నిరహంకారంగా చెయ్యాలి, అప్పుడు ఏమి అవుతుంది అంటే మోక్షాన్ని సంపాదించాలి అనే తలంపు ఆరోజుకారోజు లోతుకు దిగుతుంది. మోక్షాన్ని పొందాలి, మోక్షాన్ని పొందాలి అని పైపైన అనుకొంటాము, భగవంతుడు లౌకికమైనది ఏదైనా మనకి ఆశ చూపించాడు అనుకోండి, ఏ మంత్రి పదవి ఇస్తాను అన్నాడు అనుకోండి, మోక్షం కావాలి అనే కోరిక ఊడిపోతుంది. అందుచేత మీరు సాధన చెయ్యండి, మీరు చేసే సాధన సహజంగా ఉండాలి. నిరహంకారంగా ఉండాలి. నిరాడంబరంగా ఉండాలి. నిర్మలంగా ఉండాలి. నిశ్చలంగా ఉండాలి. ధృఢంగా ఉండాలి. అది సహజంగా ఉండాలి. సాధన చెయ్యండి కాని కృత్రిమంగా ఉండకూడదు. ఇతరుల కంటే నేను ఏదో గొప్ప పని చేస్తున్నాను అనుకోకూడదు. ఇవాళ స్నానం చేసి ఎవరు చేయలేని పని నేను చేశాను అని మీరు అనుకోరు. మీరు అన్నం ఎంత సహజంగా తింటున్నారో, బట్ట ఎంత సహజంగా కట్టుకుంటున్నారో, బొట్టు ఎంత సహజంగా పెట్టుకుంటున్నారో, అంత సహజంగా మీరు



**ఆత్మానుభవం పొందటం మీదే నీ దృష్టిని అంతా కేంద్రీకరించు. ఇప్పుడు నీకు వచ్చే కష్టాలు, సుఖాలు, లాభాలు, నష్టాలు నిలబడేవికావు. ఇవి అన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి.**

సాధన చేసుకుంటూ పోతుంటే, ఈ లోకంలో ఉండగానే, ఈ జన్మలోనే మీకు అందరికి మోక్ష అనుభవం కలుగుతుంది. ఒక మాట మీరు జ్ఞాపకం ఉంచుకోండి. అహంకారానికి ఇతరులు ఉన్నారు ఆత్మకి ఇతరులు లేరు. ఎదుటి వాళ్ళు మనం మంచివాళ్లు అనుకోవాలి, సమాజం మనలని చూసి మెచ్చుకోవాలి అని ఇలా అనుకుంటే దాని వల్ల మీ అహంకారం పెరుగుతుంది కాని మీకు ఆత్మానుభవం కలుగనే కలగదు. మీరు ఒక మంచి పని చేశారు అనుకోండి ఆ మంచి పని చేసి వదిలేయండి అంతే. ఇతరులు దీనిని చూసి మెచ్చుకోవాలి అని మీరు అనుకుంటారు అనుకోండి మీ మంచి పని వల్ల పుణ్యం రావచ్చు కాని మీకు జ్ఞానం రాదు. ఇప్పుడు మన ఇంట్లో ఉన్న వ్యక్తులు అందరిని కూడా కర్మను బట్టే ఇస్తాడు, అంటే ఏ కర్మానుభవం పొందడం కోసం మనం ఈ భూమి మీదకి వచ్చామో, ఆ మనుషులు మన ఇంట్లో ఎదురు అవుతారు. కోడలు అయినా, అత్తగారు అయినా, మామగారు అయినా ఎవరు అయినా మన కర్మను బట్టే వస్తారు.

సంసారం వల్ల బాగా సుఖ పడిన వాళ్లు ఉన్నారు, సంసారం వల్ల చాలా కష్టాలు పడిన వాళ్ళు ఉన్నారు. కొంతమందికి ఎంతో అనుకూలమైన భార్య ఉండవచ్చు, కొంతమందికి అనుకూలమైన భార్య లేకపోవచ్చు. అదే కొంతమందికి ఎంతో అనుకూలమైన భర్త ఉండవచ్చు, కొంతమందికి అనుకూలమైన భర్త లేకపోవచ్చు, వీటన్నింటికీ కారణం ఏమిటి? ఈ సుబ్బారాయుడులు అందరూ మనకు ఎందుకు సిద్ధం అవుతున్నారు అని మీరు అనుకోకండి. మనం ట్రైనింగ్ పొందడం కోసం ఆ వ్యక్తిని తీసుకొచ్చి ఇక్కడ తగిలించాడు, ఈ ఇంజనుకు ఆ పెట్టెను తగిలించాడు. కర్మానుభవం పొందటం కోసం. ఈ జన్మలో మీ ఇంట్లో పుట్టిన వాళ్ళు అందరూ మళ్ళీ మీ ఇంట్లో పుడతారు అని ఏమీ లేదు. మళ్ళీ వచ్చే జన్మలో భగవంతుడు మార్చేస్తాడు. ఆ కర్మానుభవం అయిపోయిన తరువాత మళ్ళీ transferలు పెడతాడు. ఈ జీవుడికి transferలు ఉంటాయి. చచ్చిపోతే జ్ఞానం వస్తుంది అనుకోకండి, చచ్చిపోతే జ్ఞానం వచ్చేస్తే ఈ పుస్తకాల గొడవ ఎందుకండీ? ఈ పూజలు ఎందుకు? ధ్యానాలు ఎందుకు? ఉపవాసాలు ఎందుకు? లతమ్మ గారు ఉన్నారు, లతమ్మ గారు పాలకొల్లు నుండి ఆలమూరు రావడం వల్ల పాలకొల్లు దూరం అయ్యింది, ఆలమూరు దగ్గర అయ్యింది. అంటే పాలకొల్లులో ఉన్న లతమ్మ గారు ఆలమూరు వచ్చారు కాని లతమ్మగారు ఏమి మారలేదు. ప్రయాణం చేయటం వల్ల పాలకొల్లు దూరం అయ్యింది. ఆలమూరు వచ్చి పడ్డాం. అదే విధంగా చచ్చిపోయిన తరువాత మనం మనలానే ఉంటాం పాత దేహం పోతుంది, కొత్త దేహం వస్తుంది. పాలకొల్లు పోయి ఆలమూరు వచ్చినట్టే. బ్రహ్మానుభవం

పొందే వరకు ఎవరిని ప్రకృతి విడిచిపెట్టదు. ప్రకృతి యొక్క వల లోంచి, ప్రకృతి గుణాలు లోంచి, మీరు బయట పడాలి అంటే ఒకటే ఉపాయం. మీ లక్ష్యం మోక్షాన్ని పెట్టుకోండి. ఆత్మ జ్ఞానాన్ని పెట్టుకోండి. దానిని తప్పించి ఇంకో ఉపాయం లేదు. అది సహజంగా చెయ్యండి, కృత్రిమంగా చెయ్యద్దు. ఏదైతే సహజమో అది నిజం. ఏదైతే సహజం కాదో అది నిజం కాదు. అది కృత్రిమం. మనం గాంధీగారు భక్తుడు అనుకుంటున్నాం. కాని సుభాష్ చంద్రబోస్ భక్తుడు అన్న సంగతి మనకి తెలియదు. ఇతరులకి ఎవరికీ కనపడకుండా భగవద్గీత ఎప్పుడూ జేబులో పెట్టుకునేవాడు, ఆయన గదిలో కూర్చొన్నప్పుడు చదువుకునే వాడు. అంటే తాను భక్తుడు అని ఇతరులకి తెలియాలి అని కూడా అనుకోలేదు. స్వాతంత్ర్య సమరంలో ఎన్నో త్యాగాలు చేసినటువంటి వాడు బోసు. సుభాష్ చంద్రబోసుకి విమాన ఏక్సిడెంట్‌లో ప్రాణం పోయే టైములో శరీరం కొంచెం కాలిపోయి ఉంది, అటువంటి బాధ టైములో కూడా ప్రశాంతంగా ఉండగా, ఏవండీ మీరు ఇంత శారీరకమైన బాధ పడుతున్నారు, కనీసం మీ ముఖంలో దుఃఖం కాని, కళ్ల వెంట నీరు కాని, ఏమీ కనిపించటం లేదు అంటే "భారతదేశ స్వాతంత్ర్య సమరంలో నన్ను నమ్మి వేలాది మంది చనిపోయారు. ఈ రోజు నాకు మరణం వచ్చినప్పుడు నేను కన్నీళ్లు కారిస్తే ఆ అమరజీవులు అందరికీ నేను అపచారం చేసిన వాడిని అవుతాను" అన్నాడు బోసు. అంత సహజంగా ప్రాణం విడిచిపెట్టాడు. నిజమైన మందు ఏది అంటే ధైర్యం అని భీష్ముడు చెప్పాడు. మీకు అవమానాలు వస్తున్నాయి అనుకోండి, మీకు అగౌరవాలు వస్తున్నాయి అనుకోండి, జీవితంలో ఒడి దుడుకులు వస్తున్నాయి అనుకోండి, వీటి అన్నిటినీ ఓర్చుకోవటానికి ఒకే ఒక మందు ఉంది. మహా భారతంలో భీష్ముడు చెప్పిన మాట, అది ఏమిటంటే ధైర్యం. అన్నింటికంటే జీవితంలో నీచమైనది ఏమిటంటే నా హృదయంలో ఉన్న దౌర్భల్యం. నేను బ్రహ్మానుభవం పొందకుండా ఎవరో ఇతరులు నాకు అడ్డురావటం లేదు. నా హృదయంలో ఉన్న దౌర్బల్యమే నాకు అడ్డు వస్తోంది. అంటే అన్నింటికంటే పరమ నీచమైనది ఏమిటంటే నా హృదయంలోని పిరికితనమే అన్నింటికంటే నీచమైనది. హృదయ దౌర్బల్యం నీచమైనది. నువ్వు చేసే పని చెయ్యి, నువ్వు సహజంగా చెయ్యాలి. Artificialగా చెయ్యకు, Naturalగా చెయ్యి. Normalగా చెయ్యి. నేను శ్రమ పడిపోతున్నాను అని నువ్వు అనుకోవద్దు. సహజంగా మీరు చేసుకునే పూజ చేయండి, జపం చేయండి, ధ్యానం చేయండి, విచారణ చేయండి, ఏది చేసినా అడుగులు లెక్క పెట్టుకున్నట్టు ఉండకండి, మీరు సహజంగా చేసుకుని వెళ్ళిపోండి. అడుగులు లెక్క

పెట్టినా మీరు వెళతారు. అడుగులు లెక్కపెట్టడం మానేసినా మీ గమ్యానికి మీరు వెళ్ళిపోతారు. అందుచేత నిముషాలు, గంటలు ఈ లెక్కలలోకి వెళ్ళకండి. మీరు చేసుకునే ప్రయత్నం, మీరు చేసుకునే సాధన, మీరు సహజంగా చేసుకువెళ్లిపోతూ ఉండండి. ధ్యానాలు చేయండి, జపం అలాగే చేయండి, ఏమి చేసినప్పటికీ సహజంగా మీ శరీరంలో ఒక భాగం అయిపోవాలి. మీ మనస్సులో ఒక భాగం అయిపోవాలి. మీ ఎముకలలో ఒక భాగం అయిపోవాలి. మీ రక్తంలో ఒక భాగం అయిపోవాలి. నేను గుండెను మోస్తున్నాను, రక్తాన్ని మోస్తున్నాను, కాళ్ల మోస్తున్నాను, చేతులు మోస్తున్నాను అనుకుంటున్నానా? శరీరాన్ని నేను మోసుకుంటున్నాను అనుకుంటున్నానా? అదే విధంగా ఈ దేహంలో అవయవాలు ఎంత సహజంగా నీకు ఉన్నాయో, నువ్వు చేసే సాధన కూడా అంత సహజంగా ఉండాలి. అది బరువు కింద ఉండకూడదు. నీకు కర్తృత్వం ఉంటే బరువు, కర్తృత్వం లేని వాడికి బరువు లేదు. నేను చేస్తున్నాను అనే భావన ఉంటే ఆ భావన బరువు తీసుకు వస్తుంది కాని ఆ భావన నీకు లేకపోతే బరువే లేదు. లోక కల్యాణం కోసం ఈ పని చెయ్యి అంటే ఆ పని చెయ్యాలి. నేను చేస్తున్నాను అనే భావన లేకుండా ఎవడైతే పని చేస్తున్నాడో వాడికి తెలిసినా తెలియకపోయినా వాడి ద్వారా లోక క్షేమం జరుగుతూనే ఉంటుంది.

దేహబుద్ధి లేకుండా మీరు పని చేస్తుంటే మీకు తెలిసున్నా, మీకు తెలియకపోయినా, మీరు చేసే ప్రతీ పని, మీరు మాట్లాడే ప్రతీ మాట, మీకొచ్చే ప్రతీ ఆలోచన, లోక శాంతి కోసం, లోక క్షేమం కోసం జరుగుతూనే ఉంటుంది. నేను ఈ లోకానికి ఉపకారం చెయ్యాలి అలా అనుకోనక్కరలేదు. మీకు దేహబుద్ధి పోయింది అనుకోండి మీరు చేసే ప్రతీ పని వలన లోకంలో ఎక్కడో ఒక చోట మంచి జరుగుతూనే ఉంటుంది. ఆ వైబ్రేషన్స్ అలా పని చేస్తూ ఉంటాయి. మీరు అనుకోనక్కరలేదు. అందరికి జ్ఞానం కావాలి. జ్ఞానం ఎలా వస్తుంది? శ్రద్ధ అనే రెండు అక్షరాలు జ్ఞాపకం ఉంచుకోండి. శ్రద్ధ ఉంటే మీకు జ్ఞానం వచ్చేస్తుంది. అందుచేత శ్రద్ధగా ఉండండి. అశ్రద్ధ పనికిరాదు. అజాగ్రత్తగా ఉండకూడదు. మన అందరి దగ్గర ఒక చెడ్డ ఉందండి. మీలో ఉంది, నాలో ఉంది అందరి దగ్గర ఒక చెడ్డ ఉందండి. ఆ చెడ్డ ఏమిటంటే మనం భగవంతుడిని ఉపయోగించుకొంటున్నాం కాని, ఆయనను గమ్యంగా పెట్టుకోవటం లేదు. అంటే మనకున్న కోరికలను నెరవేర్చుకోవటం కోసం భగవంతుడిని ఉపయోగించుకుంటున్నాం. భగవంతుడిని ప్రార్థిస్తున్నాం. మీకు అర్థం అవుతోందా, భగవంతుడిని ప్రార్థిస్తున్నాం కానీ మన గమ్యం భగవంతుడు కాదు.

గమ్యం ఎవరు? మన కోరిక. భగవంతుడినే మన గమ్యంగా పెట్టుకుంటే ఆయన దొరుకుతాడు. మన కోరిక నెరవేర్చటం కోసం భగవంతుడిని ప్రార్థిస్తున్నాం. అలా కాకుండా మనం భగవంతుడినే గమ్యంగా పెట్టుకుని భగవంతుడినే కనుక ప్రార్థిస్తుంటే, ఏ కోరిక ఉన్నా నెరవేరుస్తాడు ప్రత్యేకించి అడగక్కరలేదు. మీకు కోరిక లేదు అనుకోండి ఆయన స్వరూపాన్ని మీకు ఇచ్చేస్తాడు. కోరిక కోరావా, కోరిక తీర్చేసి ఆయన స్వరూపం ఇవ్వకుండా వెళ్ళిపోతాడు. మీరు సహజంగా చేసుకుంటూ వెళ్ళాలి, శ్రమ అనుకోకూడదు. శ్రమ, కష్టం అనుకోకుండా ప్రీతిగా చేయాలి. ఇష్టంగా చేయాలి. ఓ అర్జునా యుద్ధం చేయటం నీకు ఎలాగూ తప్పదు. ఈ భూమి మీదకి నువ్వు అందుకే వచ్చావు, నీకు ఇష్టం ఉన్నా యుద్ధం తప్పదు. ఇష్టం లేకపోయినా నీకు యుద్ధం చేయటం తప్పదు. ఏ పని నిమిత్తం నువ్వు భూమి మీదకి వచ్చావో ఆ పని నువ్వు ఇష్టంతో కనుక చేస్తే, కొత్త వాసనలు రావు. పాత వాసనలు పోతాయి. అదే అయిష్టంగా కనుక చేస్తే పాత వాసనలు పోవు. కొత్త వాసనలు వస్తాయి. పని ఎలాగూ తప్పదు, శ్రమ ఎలాగూ తప్పదు, ఆ చేసే పని అయిష్టంగా కాకుండా ఇష్టంగా చెయ్యి. ఇంకేమీ వద్దు. ఇదే గీతా మహత్యం. ఏవో నాలుగు మాటలు నేను చెబుతున్నాను అనుకోండి ప్రీతిగా కాకుండా అప్రీతిగా నేను చెబుతున్నాను అనుకోండి, మీ మనస్సుకి ఎక్కదు. అప్పుడు తప్పు మీది కాదు ఆ తప్పు నాది. చెప్పేది ప్రీతిగా చెప్పాలి, ఇష్టంగా చెప్పాలి. ప్రేమ పూర్వకంగా చెప్పాలి, మీరు బాగు పడాలి అనే కాంక్షతోటి చెప్పాలి. చెప్పటం ఎలాగూ తప్పదు మీకు, ఆ చెప్పేది ఇష్టంగా చెప్పు, అయిష్టంగా చెప్పకు. ఆ చెప్పేది అప్రీతిగా చెప్పొద్దు, ప్రీతిగా చెప్పు. ఇది భగవంతుడు చెప్పే విషయం. యోగం ఎందుకు? మనలో ఉన్న అజ్ఞానాన్ని నశింప చేసుకోవటానికే యోగం, లేకపోతే యోగం తోటి పని లేదు. ఒకసారి భగవాన్‌ని అడిగారు మీకు యోగాభ్యాసం ఉందా? నాకు వియోగం లేదు, అంటే ఇంక యోగంతో పని లేదు. వియోగం ఉన్నవాడికి యోగం ఉండాలి.

**ఎవడైతే కష్టపడి పని చేస్తూ ఫలితాన్ని**
**సమాజానికి ఇస్తాడో వాడే బుద్ధిమంతుడు.**



అనారోగ్యవంతుడికి మందు, ఆరోగ్యవంతుడికి మందు ఎందుకండీ? ఎవరికి యోగాభ్యాసం? వియోగం ఉన్నవాడికి యోగం కావాలి. బ్రహ్మము సనాతనమైనది. అది ఎప్పుడూ ఉండేదే. నువ్వు సాధన చెయ్యటం వల్ల అది కొత్తగా రాదు. కొత్తగా వచ్చేది కాలప్రవాహంలో కొట్టుకుపోతుంది. మీ సాధన యొక్క గమ్యం దేహబుద్ధిని పోగొట్టుకోవటం కోసమే. అందుచేత నేను సాధన చెయ్యటం వల్ల నాకు బ్రహ్మం కొత్తగా వస్తుంది అని నువ్వు అనుకోనక్కరలేదు. అది ఎప్పుడూ ఉంది. అది లేని చోటంటూ లేదు ఒక చోట ఉండి మరొక చోట లేకపోవటం లేదు. సర్వత్రా వ్యాపించి ఉంది, అన్ని కాలాల్లో ఉంది. అన్ని దేశాల్లో ఉంది. అంతటా ఉన్నదే నీ హృదయంలోనూ ఉంది, ఇక్కడ ఉన్నదే అంతటా ఉంది. ఇదే అది, అదే ఇది. దీనికి, దానికి బేధం లేదు. మీ సాధన యొక్క గమ్యం ఏమిటంటే మీ దేహబుద్ధిని పోగొట్టుకోవటమే. ఎప్పుడైతే దేహబుద్ధి పోయిందో, దేహబుద్ధి పోయిన క్షణంలో వెంటనే బ్రహ్మం వ్యక్తం అయిపోతుంది. అది స్థిరంగా ఉంది, మీకోసం ఎదురు చూస్తూ ఉంది. రామకృష్ణ పరమహంస గారు చెప్పారు. దానికోసం నువ్వు ఒక అడుగు ముందుకు వెయ్యి, నీ కోసం అది పది అడుగులు ముందుకు వేస్తుంది. ఇంకో మాట చెప్పారు రామకృష్ణ పరమహంస గారు కొంతమందికి పుచ్చుకోవటం తెలుసు కాని ఇవ్వటం తెలియదు అట. పుచ్చుకోవటం నేర్చుకుంటున్నారు కదా ఇవ్వటం కూడా నేర్చుకోండి. ఇది నేర్చుకున్నప్పుడు అది ఎందుకు మీరు నేర్చుకోరు అంటున్నారు పరమహంస. ఇది నేర్చుకున్నప్పుడు అది కూడా నేర్చుకోండి. అది కూడా మీకు బ్రహ్మానుభవం కలగటం కోసం సహకరిస్తుంది. మీ హృదయంలో ఉన్న బ్రహ్మం మిమ్మల్ని సుఖ పెట్టినట్టుగా, బాహ్యంగా ఉన్న దేవుళ్లు ఎవరు కూడా మిమ్మల్ని సుఖ పెట్టలేరు. మన శాంతిని ఎవరైతే కోరుతున్నారో, మన సుఖాన్ని ఎవరైతే కోరుతున్నారో వాళ్ళు అందరూ దేవతలు. ఎవరైతే మనలని కష్టాలకు గురి చెయ్యాలి అనుకుంటున్నారో, మనం బాధలు పడాలి అని ఎవరైతే కోరుకుంటున్నారో వాళ్ళు రాక్షసులు.

రాక్షసులు ఉన్నంతకాలం, దేవతలు ఉన్నంతకాలం, సుఖం వస్తూ ఉంటుంది, కష్టం వస్తూ ఉంటుంది. ఇవి రెండిటిని సమాన స్థాయికి మనం తీసుకు రావాలి. దేవతలు ఎంతసేపు మనలని సుఖపెడదాం అని చూస్తారు. రాక్షసులు ఏమి చేస్తారు మనలని కష్టపెడదాం అని చూస్తారు. దేవతలు పంపించే సుఖాలు వచ్చినప్పుడు మనం పొంగకూడదు. రాక్షసులు పంపించే కష్టాలు వచ్చినప్పుడు మనం వికారాలు పెట్టుకోకూడదు. React అవ్వ కూడదు. అంటే మీరు చిన్న పనే చెయ్యండి, చిన్న ప్రయత్నమే చేయండి. అందులో

నిజాయితీ ఉండాలి. అంటే మాట, మనస్సు, చేత నిదానంగా ఉండాలి. చేసే పనిలో శ్రద్ధ ఉండాలి. దానం కూడా ఎలా ఇవ్వాలో చెప్పారు. ఎదుటివాడిని మన ఇంటికి రమ్మని దానం ఇచ్చే కంటే మనం ఎవరికీ అయితే దానం ఇవ్వాలి అనుకుంటున్నామో, వారి ఇంటికి గనుక పట్టుకెళ్లి ఇస్తే, అనంతమైన ఫలితం వస్తుంది అని ఉపనిషత్తులలో చెప్పారు. వాళ్లకి రూపాయి అవసరం అని మనకు తెలిస్తే, వారింటికే వెళ్లి మనం రూపాయి ఇస్తే, రూపాయే కాని ఫలితం అనంతంగా ఉంటుంది. ఇది ఉపనిషత్తులో చెప్పిన మాట ఇది. ఎవడికి అయితే బ్రహ్మానుభవం ఉందో వాడు చెబుతుంటే వినాలి బ్రహ్మము గురించి, అప్పుడు నీకు బ్రహ్మం యందు విశ్వాసం కలుగుతుంది. బ్రహ్మానుభవం లేనివాడు బ్రహ్మము గురించి చెబితే వింటారు కాని బ్రహ్మము అనేది ఒకటి ఉంది అనే విశ్వాసం కలగదు. మరి ఎవరు చెబితే కలుగుతుంది? ఎవరికి అయితే బ్రహ్మానుభవం ఉందో, వాడు చెబుతుంటే ఈ వినేవాడికి కూడా బ్రహ్మము మీద సజీవమైన విశ్వాసం వస్తుంది. బ్రహ్మానుభవం పొందిన వాడే చెప్పాలి. అప్పుడే వినేవాడికి కూడా ఆ వస్తువును సంపాదించాలి, ఆ వస్తువును తెలుసుకోవాలి అటువంటి ఒక వేదన, ఒక ఆకాంక్ష, ఆ జిజ్ఞాస కలుగుతుంది. మీ కుటుంబానికి సంబంధించిన పనులు మీరు జాగ్రత్తగా చేసుకోండి. మీ దేహ ప్రారబ్ధాన్ని బట్టి ఏ పని అయితే మీకు భగవంతుడు నివేదించాడో ఆ పని శ్రద్ధగా చేసుకోండి. ఆ పని గొప్ప, ఈ పని తక్కువ అని లేదు. ఒక పని ఎక్కువ కాదు, ఒక పని తక్కువ కాదు. చేతిలో ఉన్న పనే శ్రద్ధగా చెయ్యటం. ఒకరు పాయసం చేస్తారు అనుకోండి మాట వరసకి, ఒకరు పచ్చడి చేస్తారు అనుకోండి, పాయసం గొప్పది, పచ్చడి తక్కువ అనుకోవద్దు. పాయసం చేసేవాడి కంటే పచ్చడి చేసేవాడు గొప్పగా చేసాడు అనుకోండి దేవుడు అనుగ్రహం వీడికి వస్తుంది. ఎందుచేత? వాడి చేతిలో ఉన్న పని వాడు బాగా చేశాడు కాబట్టి. మీ చేతిలో ఉన్న పని మీరు బాగా చెయ్యడం కూడా ఒక యోగమే. మనస్సుని అక్కడ పెట్టి బాగా చెయ్యడం కూడా ఒక యోగమే. దానివల్ల కూడా మీరు ఈశ్వరుని అనుగ్రహం పొందుతారు. ఒక చెప్పులు కుట్టేవాడు ఉన్నాడు అనుకోండి, ఒక జిల్లా కలెక్టరు గారు ఉన్నారు అనుకోండి, ఆయన సరిగ్గా పరిపాలన చెయ్యలేక పోతున్నాడు అనుకోండి, జిల్లా ప్రజల కష్ట సుఖాలు సరిగ్గా చూడలేక పోతున్నాడు అనుకోండి. చెప్పులు కుట్టేవాడు చెప్పులు బాగా కుడుతున్నాడు అనుకోండి, ఆ జిల్లా కలెక్టరు కంటే ఈ చెప్పులు కుట్టేవాడు గొప్పవాడు. జిల్లా కలెక్టరు కంటే వీడికి ముందు దేవుడి అనుగ్రహం వస్తుంది. అందుచేత మీ పని మీరు శ్రద్ధగా చేసుకోండి.

మీ పని విషయంలో అశ్రద్ధగా ఉండొద్దు. ఇతరుల గొడవలలో సాధ్యమైనంత వరకు కలగజేసుకోవడం తగ్గించుకోండి, అది మీకు ఉపకారం, అది మీకు ఆధ్యాత్మికంగానూ, మీ భౌతిక శ్రేయస్సుకి కూడా ఉపకారం జరుగుతుంది. అందుచేత మీరు శ్రమ అనుకోవద్దు, మీరు ఎంత సహజంగా శ్వాస తీసుకుంటున్నారో, ముక్కులో ఉన్న గాలి ఎంత సహజంగా తిరుగుతుందో, అంత సహజంగా అంత సరళంగా, అంత నిర్మలంగా కనుక మనం దేవుడి కోసం ప్రయత్నాలు చేస్తుంటే, అప్పుడు దేవుడు ఎటువంటి బుద్ధి ఇస్తే మనకు దేహబుద్ధి పోతుందో, అటువంటి బుద్ధి ఆయన ప్రసాదిస్తాడు. అప్పడు దేహబుద్ధి ఊడిపోతుంది. ఎప్పుడు అయితే దేహబుద్ధి ఊడిపోయిందో అప్పుడు ఏమి వస్తుంది? ఆత్మబుద్ధి తెలుస్తుంది. జాగ్రత్తగా ఉండి, మీ కుటుంబానికి సంబంధించిన పనులు మీరు చేసుకోండి. కాని అజాగ్రత్తగా ఉండకండి. మీ చేతిలో ఉన్న పని మీరు బాగా చేయటం కూడా ఒక యోగమే. దాని వల్ల కూడా మీరు ఈశ్వర అనుగ్రహం పొందుతారు. అరుణాచల శివ, అరుణాచల శివ, అరుణాచల శివ, అరుణాచలా. ప్రియమైన ఆత్మ బంధువులారా, ఒక చిన్న రహస్యాన్ని చెబుతాను మీరు గుండెలో దాచుకోండి, మనం రహస్యాలు అనుకున్నప్పుడు రహస్యాలే. మీ పక్కింటి వాళ్లకి కూడా మీరు చెప్పొద్దు. మన పెద్దలు అందరూ ఏమి చెబుతారు అంటే భగవంతుడిని జ్ఞాపకం పెట్టుకోమని, భగవంతుడిని స్మరించుకోమని, భగవంతుడి నామం చేసుకోమని చెబుతారు. ఎందుచేత అంటే భగవంతుడిని స్మరించుకుంటే అహంకారం తగ్గుతుంది. భగవంతుడిని మరచిపోతే అహంకారం పెరుగుతుంది.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి** అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# శ్రీమద్భగవద్గీత

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)

**త్వమేవ శరణం గచ్ఛ సర్వ భావేన భారత ।**

**తత్ప్రసాదాత్పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్ ॥18-62॥**

**తాత్పర్యము:** ఓ భారత! అర్జున! అన్ని విధములుగా ఆ పరమేశ్వరుడినే శరణుజొచ్చుము. అతని కృపచేతనే పరమశాంతిని, శాశ్వతమైన పరమపదమును పొందగలవు.

అర్జునా, నీ హృదయములో ఈశ్వరుడు ఉన్నాడు. అన్ని రకాలుగా, అన్ని విధాలుగా నీకు అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని నువ్వు శరణాగతి చేసుకో. గతి అల్లా శరణాగతి ఒక్కటే, దానికి మించిన మార్గం లేదు. సర్వభావేన భారత! నీకు కష్టం వచ్చినా సంతోషం వచ్చినా ఈశ్వరుని ప్రసాదం అనుకో, నిన్ను ఎక్కడ కూర్చోపెడితే, అక్కడ ఈశ్వరుడు కూర్చోపెట్టాడు అని తెలుసుకో. మీ సమాజంలో కానీ, ఇంటిలో కానీ ఏమైనా సంఘటనలు జరుగుతుంటే అది ఈశ్వరుడికి తెలియకుండా జరగదు. అందుచేత ఏదైనా కష్టకాలం వస్తే దానిని ఓర్పుగా అనుభవించేయి, వచ్చే జన్మకి అది రిపీట్ అవ్వదు అంటున్నాడు. కొంతమంది వాళ్ళకి ఏదైనా కష్టం వస్తే వందమందిని తిడతారు. అలా వద్దు. ఇప్పుడు నీకు వచ్చిన నీ కష్టానికి, పూర్వజన్మలకి ఏదో సంబంధం ఉంది.

అర్జునా! ఈ కనిపించేది అంతా నువ్వు నిజం అనుకుని సంతోషం వస్తే సంతోషిస్తున్నావు, దుఃఖం వస్తే దుఃఖపడుతున్నావు. లాభం వస్తే పొంగిపోతున్నావు, నష్టం

వస్తే కుంగిపోతున్నావు. నీ దేహం, ఈ సృష్టి, నిజం కాదని నీకు తెలిసినప్పుడు, నీకు సంతోషం వస్తే సంతోషించేవాడు, దుఃఖం వస్తే దుఃఖపడేవాడు ఎవడు ఉన్నాడు! ఇవన్నీ మనోదేహాలకి సంబంధించినవే కానీ నీకు సంబంధించిన విషయం కాదు. అంటే బ్రాహ్మీస్థితి పొందిన వాడికి ఈశ్వరుడికి శరణాగతి పొందిన వాడికి సంతోషమేల దుఃఖమేలా!

మన ఇంట్లో మనుషులు కూడా దేహాప్రారబ్ధాన్ని బట్టి సిద్ధం అవుతారు. ఎటువంటి కుటుంబంలో పుట్టాలి, ఏ కులంలో పుట్టాలి, ఏ సామాజిక పరిస్థితిలో పుట్టాలి, అది కూడా మీ ఇష్టం కాదు, అది ఈశ్వర సంకల్పమే. నువ్వు ఒకటి లేని సున్నవు! మీ తెలివితేటలని బట్టి మీరు ఎక్కడ పుట్టాలో నిర్ణయించుకోలేరు. ఈశ్వర నిర్ణయం అది. మంచి ప్రారబ్ధం ఉంటే పొంగిపోవద్దు, చెడ్డ ప్రారబ్ధం ఉంటే కుంగిపోవద్దు, దానిని ఓర్పుతో, సహనంతో అనుభవించేయండి. సహనం వల్ల మీకు హృదయంయొక్క లోతులు పెరుగుతాయి. మనస్సు విశాలం అవుతుంది. ఇప్పుడు ఏ ప్రారబ్ధాన్ని అయితే మీరు సహనంతో అనుభవించారో, రాబోయే జన్మలో మట్టుకు ఆ ప్రారబ్ధం మీకు రాదు. చిరాకుగా అనుభవిస్తే అదే సిద్ధం అవుతుంది. ఇది ఇక్కడ సిద్ధాంతం.

అందుచేత అన్నివిధాలా నీకు అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని, అంటే నీ దేహము కంటే, నీ మనస్సు కంటే, నీ ఇంద్రియాలకంటే, అత్యంత దగ్గరగా, నీ హృదయములో ఉన్నటువంటి పరమేశ్వరుడిని శరణాగతి చెయ్యి. భగవంతుడు ఉన్నచోట వెదకటం మానేసి లేనిచోట వెదుకుతాను అంటావేంటి నువ్వు!


సర్వభావేన భారత - నువ్వు ఏదైనా మంచిపని చేసినా ఈశ్వరార్పణంగా చెయ్యి. ఇంకో దేహానికి మీరు సహాయం చేశారనుకోండి, ఆ దేహం కూడా మీదే అనుకొని చేస్తే మీకేమీ వికారాలు రావు. ఆ దేహం వేరు నేను వేరు అనేటటువంటి బేధబుద్ధితోటి చేస్తే వికారాలు ప్రారంభమవుతాయి, అక్కడనుంచి గౌరవాలు ఇంకేదో ఆశించాలనిపిస్తుంది.

తత్ప్రసాదాత్పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్ - నువ్వు ఈశ్వరుడికి శరణాగతి చేస్తే, వాడిని పూజిస్తే, వాడిని జపిస్తే, వాడి ఇష్టం కోసం నీ ఇష్టాలని ఒక పక్కన పెట్టి నువ్వు పని చేస్తే అప్పుడు ఆయన ప్రసాదం నీకు కలుగుతుంది. ప్రసాదం అంటే గుళ్ళో తినేది

కాదు. ప్రసాదం అంటే అనుగ్రహం. ప్రసాదం అంటే దయ. మనం మనస్సుని కేంద్రంగా పెట్టుకొని జీవిస్తున్నాము. మీ మనస్సుని ఒకపక్కన పెట్టి ఈశ్వరుని కేంద్రంగా పెట్టుకొని జీవించు. అప్పుడు ఆయన అనుగ్రహం, దయ మీకు కలుగుతుంది. ఏదో చేయటంవల్ల ఏదో వస్తుంది కానీ మోక్షం రాదు. ఈశ్వరుని ప్రసాదం లేకుండా, అనుగ్రహం లేకుండా ఆయన దయ మీకు కలగదు. మీకు ఆయన దయ కలిగినప్పుడు, శాశ్వతమైనటువంటి శాంతిని, అలౌకికమైన అంటే ఈ లోకంలోని మనుషులతోటి చావుపుట్టుకలతోటి సంబంధం లేనటువంటి సుఖాన్ని, స్వతంత్రమైనటువంటి సుఖాన్ని శాంతిని మీరు ఇప్పుడే ఇక్కడే ఈ జీవితంలో ఉండగానే పొందుతారు.

త్వమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత! భగవంతుడు మనకి అవకాశాలు ఇచ్చినప్పుడు, ఆ అవకాశాలని దుర్వినియోగం చేసుకోకూడదు. భగవంతుడు మీకేదైనా మంచి అవకాశాలు ఇస్తే, అవి భగవంతుడి అనుగ్రహం సంపాదించటానికి, భగవంతుడి దయ సంపాదించటానికి ఉపయోగించుకోండి. అదే ఇక్కడ కృష్ణుడు చెపుతున్నాడు నీ హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు, వాడిని శరణాగతి కోరుకో. నిన్ను ఆడించేవాడు, పాలించేవాడు వాడే, నిన్నే కాదు సృష్టిలో ఎక్కడ ఏది జరిగినా ఆయనకి తెలియకుండా జరగటానికి వీలులేదు. అంతర్యామి అంటే కృష్ణుడే. ఇక్కడ! ఈశ్వరుడు ఈశ్వరుడు అంటూ మనని మళ్ళీ మాయ మాటలలో పెడుతున్నాడు

తత్ప్రసాదా అంటే ఆయన అనుగ్రహం. , నీకున్న అవకాశాలు అన్నీ గొప్పల కోసం కాకుండా, భగవంతుడి యొక్క అనుగ్రహం, దయ సంపాదించటానికి ఉపయోగిస్తే, శాశ్వతమైన సుఖం శాశ్వతమైన శాంతి, ఆనందం, పునర్జన్మలు లేనటువంటి ఒక పరమస్థితిని ఒక పరమశాంతిని ఒక పరమసుఖాన్ని, నీకు భగవంతుడు లభ్యం చేస్తాడు. ఆయన దయ వల్లే అది సాధ్యం. ఆయన దయ నీకు కలగాలంటే, భగవంతుడు నీకు ఇచ్చిన అవకాశాలనన్నిటినీ - నీకు డబ్బు ఇస్తే డబ్బు, తెలివి ఇస్తే తెలివి, చదువు ఇస్తే చదువు, వివేకం ఇస్తే వివేకం, నీకు భగవంతుడు ఇచ్చిన అవకాశాలనన్నిటినీ ఆయన అనుగ్రహం సంపాదించటానికి ఉపయోగించుకో భారత!



# అరుణాచల మహత్మ్యం అక్షరమణమాల

**సుఖ సముద్రము పొంగ వ్వానములడంగ।**

**యూరక నమరుమందు అరుణాచలా ॥ 31 ॥**

**తాత్పర్యము:** హృదయములో ఉన్న సుఖసముద్రము ఉప్పొంగి - నా మాట నా మనస్సు అణిగిపోయేటట్లు - నీవు నా హృదయములో స్థిరముగా నిలిచిపో అరుణాచలా!

సుఖసముద్రము పొంగ - నా హృదయములో సుఖసముద్రము ఉంది, అది ఎప్పుడైతే పొంగిందో, మనస్సు అణిగిపోతుంది, వాక్కు అణిగిపోతుంది, ఇంద్రియాలు అన్నీ అణిగిపోతాయి. ఇప్పుడు మీరు మనస్సు అణగటం కోసం ప్రాణాయామాలు చేస్తున్నారు, సత్సంగాలు చేస్తున్నారు, ఇవన్నీ చేస్తున్నారు. అదేమీ అక్కరలేదు. మీ హృదయములో ఉన్న సుఖం పొంగినప్పుడు, శాంతి పొంగినప్పుడు, లోపల ఉన్నటువంటి ఆనందం పొంగినప్పుడు, ఏదైతే సత్యమో అది అనుభవంలోకి వస్తుంది. ఏదైతే సత్యమో, అదే జ్ఞానం. ఏదైతే జ్ఞానమో అదే ఉండటం, ఏదైతే ఉండటమో అదే ఆనందం. అదే ఉపనిషత్తులు వాటిల్లో, సత్యం శివం సుందరం అని ఇలా వర్ణించి చెపుతారు. ఉన్నది ఒకటే, సత్యమే ఆనందము, సత్యమే సుఖము, సత్యమే శాంతి. సత్యం అంటేనే ఉండటం అని. ఇప్పుడు మీకందరికీ చనిపోవాలని ఉందా? ఉండాలని ఉందా? ఉండాలని ఉంది. ఆ ఉండటం అనేది మీకింకా అనుభవంలోకి రావటం లేదు. అది అనుభవంలోకి రావటానికే ఆయన దయ అవసరం మనకి. ఆయన దయ లేకుండా, మన తెలివితేటల వల్ల అది సాధించేది కాదు. అందుచేత నాలో ఉన్న శాంతి సముద్రం, నాలో ఉన్న సుఖసముద్రం పొంగి సహస్రారాన్ని ముంచేయాలి. నీ ముక్కు వంకర అని చెపితే సరిపోదు, ముక్కు సరిచెయ్యాలి. నాలో లోపం ఉంది అని చెపితే సరిపోదు కదా, ఆ లోపాన్ని నువ్వే సరిచెయ్యాలి. నాలో ఉన్న సుఖసముద్రం శాంతి సముద్రం పొంగేటట్లు నువ్వే చెయ్యాలి.

బయట ఉన్నది ఉప్పు సముద్రం, హృదయంలో ఉన్నది శాంతి సముద్రం. ఇప్పుడు మనం అనుభవించే సుఖములు అన్నీ పరిణామంలో దుఃఖం కింద మారిపోతాయి. బయట

వ్యక్తులలోంచి కానీ, పరిస్థితుల్లోంచి కానీ, వస్తువులలోనుంచి కానీ సంతోషం అనుభవిస్తే, అవన్నీ దుఃఖంగా మారిపోతాయి. ఇంద్రియాలలో విషం ఉంది. చైతన్యంలో ఆనందం ఉంది. నీకు సబ్జెక్టు అవగాహనలోకి వస్తూంటే, మీ దుఃఖం అంతా సంతోషంగా మారిపోతుంది.

సుఖసముద్రం వచ్చి సహస్రారాన్ని ముంచినప్పుడు, మెదడు తట్టుకోలేక చచ్చిపోతారు. ముందు సహస్రారాన్ని ప్రిపేర్ చేశాక, తట్టుకునే శక్తి వచ్చాక, ఆ సముద్రం వదిలిపెడతాడు. అప్పుడు వరద వచ్చినట్టు వచ్చి ముంచేస్తుంది. అప్పుడు దేవుడు ఉన్నాడా లేడా అనే సందేహాలు ఉండవు. ఆ సుఖం ఊహిస్తే తెలియదు. అనుభవంలోకి వచ్చినప్పుడు తెలుస్తుంది. అందుకే దక్షిణామూర్తి కూడా మౌనంగా కూర్చున్నాడు. నువ్వు నా హృదయంలో ఉండి, నాకు మెచ్యూరిటీ తీసుకొని వచ్చి తట్టుకొనే శక్తి నాకు ప్రసాదించు. అప్పుడు పౌర్ణమి రోజున సముద్రం పొంగినట్టు, హృదయంలో ఆనంద సముద్రం పొంగితే, వాక్కు మనస్సు వాటంతట అవే అణిగిపోతాయి. శరీరం మెదడు అంతాకూడా ఆనందంలో మునిగిపోతాయి.

ఎప్పుడైతే నీ లోపల ఉన్నటువంటి సుఖసముద్రం పొంగిందో, ఆ ఆనంద సముద్రం, శాంతి సముద్రం కనుక పొంగి నీ సహస్రారాన్ని ముంచేస్తూ ఉంటే, వాక్కు అణిగిపోతుంది, మనస్సు అణిగిపోతుంది. మొత్తం నీ ఇంద్రియ చేష్టలన్నీ అణిగిపోతాయి. ఇప్పుడు మనం దేహంతోటి మనస్సు తోటి తాదాప్యం పొంది ఉన్నాము. మీలోపల ఉన్న శాంతి పొంగి మీ సహస్రారాన్ని ముంచేస్తే, మీకు దేహం గొడవ కానీ, మనస్సు గొడవ కానీ, వాక్కు గొడవకానీ ఏమీ ఉండవు. శుభ్రంగా అణిగిపోతాయి. మనస్సు అణిగినప్పుడు టెండన్సీస్ కూడా అణిగిపోతాయి, అన్నీ అణిగిపోతాయి కానీ ఆ సుఖసముద్రం పొంగాలి కదా! ఆ సుఖసముద్రం పొంగటానికి ఏ విషయాలు అయితే, ఏ ఆటంకాలు అయితే, ఏ అలవాట్లు అయితే నాకు అడ్డు వస్తున్నాయో వాటిని ముందు తొలిగించు అరుణాచలేశ్వరుడా. అంటే నన్ను పరిశుద్ధుడను చెయ్యి అరుణాచలేశ్వరుడా.

కృష్ణుడు చెప్పాడు గీతలో, ఏ సుఖాన్ని పొందిన తరువాత, ఏ శాంతిని పొందిన తరువాత, దానికి సమానమైన సుఖం కానీ, దానికి సమానమైన శాంతి అనేది కానీ లేదని నీకు తెలుస్తుందో, అటువంటి సుఖం వైపుకి నీ కళ్ళు తెరువు అర్జునా! అంటే ఆ సుఖం అనుభవిస్తే, నీ మనస్సుని కదలమంటే కదలదు. ఇప్పుడు ఆగమంటే అది ఆగటం లేదు. అప్పుడు ఆ సుఖం నీ అనుభవంలోకి వచ్చిన తరువాత, ఆ శాంతి నీ అనుభవంలోకి వచ్చాక, నీ మనస్సుని కదలమని అడిగితే, అప్పుడు కదలటానికి దానికి నెససిటీ లేదు.

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# కృష్ణం వందే జగద్గురుం

ప్రతి సంవత్సరం శ్రావణమాసం కృష్ణపక్షంలో వచ్చే అష్టమి తిథి రోజున శ్రీకృష్ణ జన్మాష్టమిని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీకృష్ణాష్టమి యావత్ సృష్టికి పండుగ రోజు. శ్రీకృష్ణుడు కాలాతీతుడు, పూర్ణబ్రహ్మము కాబట్టి పుట్టినరోజు అనే మాట ఆయనకు వర్తించదు కానీ కృష్ణుడు శరీరం ధరించిన రోజు మనందరికి ఎంతో పవిత్రమైనది. అర్జునుడిని నిమిత్త మాత్రంగా చేసుకొని ఉపనిషత్తుల సారమైన భగవద్గీత ప్రబోధించిన 'జగద్గురువు' శ్రీకృష్ణపరమాత్మ. అర్జునుడికి తత్త్వబోధ చేసి పార్థసారధి అయ్యాడు. ఎవరైతే ఆత్మజ్ఞానమును అందిస్తారో వారే సారధి కాబట్టి, గురువు-శిష్యునికి సారధియే అవుతాడు. 'కృష్ణ' అనే పేరు చాలా మధురమైనది. పటికబెల్లం నోటిలో వేసుకుంటే ఎలాగైతే తియ్యగా ఉంటుందో, అలాగే కృష్ణశబ్ధం అంత తియ్యగా ఉంటుంది. కారణం ఆయనది ఆనందతత్త్వం, నిర్గుణతత్త్వం. కృష్ణుడు వాసుదేవుడు, మధురాధిపతి. వాసుదేవా అని స్మరిస్తే, అనేక జన్మలనుండి వచ్చిన వాసనలను హరించి, స్వరూప శాంతిని ప్రసాదిస్తాడు. శ్రీకృష్ణపరమాత్మ పార్థునికి ఎలాగైతే సారధి అయ్యాడో, అలాగే ఎవరైతే శ్రీకృష్ణుని ఎన్నుకుంటారో వారందరికీ ఆయన సారధి అవుతాడు. మనము జనన-మరణ రూప సంసార చక్రం నుండి బయటపడాలంటే, కృష్ణుని అనగా గురువు యొక్క సారధ్యం కోరుకోవాలి. ఒక్క పరమాత్మ మాత్రమే స్వతంత్రుడు, తక్కినవన్నీ ఆయన మీద ఆధారపడినవే. ఈ ప్రపంచం ఒక రంగస్థలం లాంటిది, ఒక ఆటస్థలం లాంటిది, జీవులు వారి వారి ప్రారబ్ధాన్ని ఖర్చు చేసుకుంటూ, వారి వారి పాత్రలను పోషిస్తూ, గమ్యమైన మనోనాశమును సాధించాలి. స్వస్వరూపానుభూతిని పొందుటలో గురువు యొక్క పాత్ర ఎంతో కీలకం. "సర్వభూతములకు మేలు చేయుటయందు ప్రీతిగలవారు నన్నే పొందుతారు" అన్న కృష్ణపరమాత్మ వాక్కు మనందరికీ శిరోధార్యం. జగద్గురువు శ్రీకృష్ణపరమాత్మ ఆశీస్సులు మనందరికీ ఉండాలని ప్రార్థిస్తూ......

**(దిll 19-08-2022 శ్రీకృష్ణాష్టమి సందర్భముగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# ఎవరూ ఎవరికీ ఏమీకారు

మనస్సు కల్పించే కూతుళ్ళు, అల్లుళ్ళు, తోబుట్టువులు ఇలా ఇంద్రియాలకు అందేవి అన్నీ అసత్యాలే. మండువేసవిలో పాదచారులు చలువపందిళ్ళు లేదా పచ్చని చెట్ల నీడలో కొద్దిసేపు కూర్చుని మంచిచెడ్డలు, కుటుంబ సమస్యలు మాట్లాడుకొని ఎవరి దారిన వారు వెళ్ళిపోతారు. ఇది చిన్న కల - ఒక గంట కావచ్చు, మన జీవనయాత్ర డబ్బది, ఎనుబది సంవత్సరాలు కావచ్చు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో జీవించటం పెద్ద కల. అందులో ఉపకారులు, అపకారులు ఉంటారు. మనం వాళ్ళ చర్యల వల్ల ఆనందం, దుఃఖం కలుగుతాయి. ఇదే మానవ జీవనశైలి. వేమన "ఆలుబిడ్డలు మాయ, అన్నదమ్ములు మాయ, తల్లితండ్రులు మాయ, తాను మాయ, మాయ జీవితానికి మాయ కల్పించిరా దీని ఇల్లు పాడాయ" అన్నారు. దీని ఇల్లు అంటే మన మనస్సే 'మాయ'. మాయ అంటే ఏమీ లేనిచోట ఉన్నట్లు ఉండేదే మాయ అని అర్థం. మనో రోగాలు అన్నిటికన్నా పెద్దరోగం సంసార సంబంధమైన వ్యక్తులే. మనం సత్యానుభవం పొందటానికి ముందు కుటుంబీకులే పెద్ద ఆటంకాలుగా ఉంటారు. ఇంట్లో సభ్యులపై మన డ్యూటీ మనం చెయ్యాలి, వాళ్ళపై మమకారం తగ్గించుకొంటే శాంతి లభిస్తుంది. దుఃఖం నశిస్తుంది. శ్రీనాన్నగారు 'సాధకులకు పరమ శత్రువులు వారి కుటుంబంలోని వారే ఈశ్వరేచ్ఛను అనుసరించి ఎవరు నడుచుకొంటారో వారే సత్యానుభవం పొందటానికి అర్హులు అవుతారు. నన్ను ప్రేమించండి, నన్ను ఆదర్శంగా తీసుకోండి, నా సలహా పాటించండి అంటే వినరు పైగా హేళనగా చూస్తారు" అన్నారు. నిజం చెప్పాలంటే ఇంట్లో వాళ్ళు మన వాళ్ళు కారు. ఆ ఈశ్వరుడే మన ఇంటికి పంపాడు, అంతా ఆయన లీల. వాళ్ళు చెడ్డగ తయారయ్యారు అని మనకు ఎందుకు వేదన, ఆ ఈశ్వరుడే వాటిని చూసుకుంటాడు అని సద్గురువు సాధకుడు అనుభవంతో గ్రహిస్తాడు. ఈశ్వర సంకల్పమే మన సంకల్పం అన్న సాధకునకు దుఃఖమే లేదు. గురువుపై భక్తిలేనివాడు ప్రారబ్ధాన్ని ఏడుస్తూ అనుభవిస్తాడు. సద్గురువు తన భక్తునికి ఇది నీ బలహీనత, ఇందుండి బయటపడు అని ప్రేరణ చేసి బాధల నుంచి బయటకు తీసుకొనివస్తాడు. అది గురువు వైభవం. కంచి పరమాచార్యులవారు "ప్రేమించరాని చోట ప్రేమ ఉంచితే అది నికృష్టమవుతుంది. మనం మన కుమార్తెలను ప్రేమిస్తాము, వారు వారి భర్తలను ప్రేమిస్తారు. అది వారికి ఉత్కృష్టం" అన్నారు. అమ్మాయికి పెళ్ళిచేసి అత్తవారి ఇంటికి పంపేటప్పుడు తల్లితండ్రులు అమ్మాయిని అల్లుడు ఎలా చూసుకుంటాడో, ఎలా బాధలకు గురిచేస్తాడో, వారి కుటుంబ సభ్యులు మన అమ్మాయిని ఎలా చూసుకుంటారో, అమ్మాయిని చిన్నప్పటి నుంచి ఎంతో గారాబంగా పెంచుకొన్నాము అని తల్లితండ్రులు కన్నీళ్ళతో ఏడుస్తూ దుఃఖపడతారు. అలాగే జీవలక్షణాలు పోయేముందు, ఆత్మానుభవం పొందేముందు అరిషడ్వర్గాలు మాట ఏమిటి? అవి బాధ, దుఃఖపడతాయని శాస్త్రం చెప్పింది. మనం సమర్థతతో, స్థిరత్వంతో, ఉన్నతత్త్వం కలిగి ఉండాలి. బాధామయ పరిస్థితుల మధ్యనే మహాత్ములు అందరూ ఆవిర్భవించారు. "విచారం ఉన్నచోట ఉపశమనం ఉంటుందని ఆత్మజ్ఞానం ప్రాప్తించిన క్షణంలో దైన్యం మాయమై పోతుంది" అని పెద్దలు చెబుతారు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**